30న వన మహోత్సవం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఈనెల 30వ తేదీన వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఉదయం పది గంటలకు నిర్వహించే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ హాజరవుతారని తెలిపారు. మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రజలతో పాటు స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు, రాజకీయ నాయకులు తదితరులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలోనూ ఇంటింటికీ ఒక మొక్క నాటే విధంగా, పాఠశాల ఆవరణలో రోడ్డుకు ఇరువైపులా, పరిశ్రమల వద్ద తదితర ప్రాంతాల్లో మొక్కలు నాటేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎరువుల పంపిణీలో వైఫల్యం

- రైతులు అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు
- జెడ్‌పి సర్వసభ్య సమావేశంలో సభ్యుల మండిపాటు
- ఎత్తిపోతల పథకాలు కావాలని పలువురు ఎమ్మెల్యేల విజ్ఞప్తి
- సభ్యుల ప్రశ్నలకు స్పందించని కలెక్టర్

మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ, పక్కన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఎరువుల పంపిణీలో అధికార యంత్రాంగం వైఫల్యం చెందిందని పలువురు సభ్యులు మండిపడ్డారు. జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత వ్యవసాయశాఖపై నిర్వహించిన సమీక్షలో జిల్లాలో ఎరువుల కొరత తీవ్రంగా ఉందంటూ పలువురు ఎమ్మెల్యేలు, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు వ్యవసాయశాఖ అధికారులను నిలదీశారు. రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు దొరక్కపోవడంతో డీలర్లు అధిక ధరలకు అమ్ముతున్నారని, రైతులతో మాట పడుతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కొన్నిచోట్ల పురుగుల మందులు కొంటేనే ఎరువులు ఇస్తామంటూ షరతులు పెడుతున్నారని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. తర్వాత నీటిపారుదలశాఖ, వైద్యారోగ్య, గృహనిర్మాణశాఖ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ తదితర శాఖల పనితీరుపై సమీక్షించారు.

వ్యవసాయశాఖపై సమీక్ష సందర్భంగా ఎరువుల కొరత అంశాన్ని తొలుత ఎమ్మెల్యే మామిడి గోవిందరావు లేవనెత్తారు. పాతపట్నం నియోజకవర్గంలోని కొత్తూరు, హిరమండలం, మెళియాపుట్టి ప్రాంతాల్లో ఎరవులు దొరకడం లేదన్నారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ డీలర్లు అధిక ధరలకు అమ్ముతున్నారని చెప్పారు. ఎరువులను రైతు సేవా కేంద్రాలతో పాటు పిఎసిఎస్, డిసిఎంఎస్‌లకూ ఇవ్వాలని సూచించారు. రణస్థలం జెడ్‌పిటిసి టొంపల సీతారాముడు మాట్లాడుతూ డీలర్ల దగ్గర ఎరువుల అమ్మకాలు పూర్తయిన తర్వాత రైతు సేవా కేంద్రాల్లో ఇస్తున్నారని ఆరోపించారు. సోంపేట జెడ్‌పిటిసి నిమ్మాన దాస్ మాట్లాడుతూ డిమాండ్‌కు తగ్గట్టుగా ఎరువులు సరఫరా చేయడం లేదన్నారు. వ్యవసాయశాఖ జెడి శ్రీధర్ జిల్లాకు వచ్చిన ఎరువులు, మండలాలకు జరిగిన పంపిణీని వివరించారు. ఎరువుల కొనుగోలుకు పురుగు మందులు ముడిపెట్టడంపై ఆయన బదులిస్తూ నాగార్జున కంపెనీయే షరతు విధించిందని, ఉన్నతాధికారులు ఆ అంశంపై లేఖ రాశారని చెప్పారు.

వైసిపి సభ్యుని వ్యాఖ్యలతో స్వల్ప వివాదం

ఎరువుల పంపిణీకి సంబంధించి నందిగాం ఎంపిపి శ్రీరామ్మూర్తి చేసిన వ్యాఖ్యలు స్వల్ప వివాదానికి దారి తీశాయి. తమ మండలంలో ఒక పార్టీకి చెందిన వారికే ఎరువులను ఇస్తున్నారంటూ విమర్శించారు. వ్యవసాయశాఖ మంత్రి జిల్లాలో ఎరువులు లేవని చెప్పడం విచారకరమన్నారు. దీనిపై ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ సభను తప్పుదోవ పట్టిస్తున్నారని, ఎక్కడ పక్షపాతం చూపారో చెప్పాలన్నారు. గతంలో వాలంటీర్ల ద్వారా వారికి నచ్చిన వారికి ఇచ్చారని చెప్పారు. దీనిపై పలువురు వైసిపి సభ్యులు లేచి వాగ్వాదానికి దిగారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ జోక్యం చేసుకుని రాజకీయ లక్ష్యాలతో ఎవరూ విమర్శలు చేయొద్దని, సానుకూల వాతావరణంలో అంశాలను చర్చిద్దామని చెప్పడంతో గొడవ సద్దుమణిగింది.

తోటపల్లి పాలనా యంత్రాంగం మన అధీనంలోనే ఉండాలి

జిల్లాలో సుమారు 40 వేల ఎకరాల వరకు ఆయకట్టు ఉన్న నేపథ్యంలో తోటపల్లి పాలనా యంత్రాంగం మన అధీనంలో ఉండేలా చూడాలంటూ ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రతిపాదించారు. బొబ్బిలిలో డివిజన్ కార్యాలయం ఉన్నందున నీటి విడుదల, నిర్వహణకు ఇబ్బందులు పడాల్సి వస్తోందని చెప్పారు. జిల్లాలో వంశధార, తోటపల్లి సాగునీటి కాలువల నిర్వహణకు లష్కర్లు లేకపోవడం ఇబ్బందిగా ఉందంటూ పలువురు సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మాట్లాడుతూ వంశధార ప్రాజెక్టు కోసం రైతులు వేలాది ఎకరాలు ఇచ్చినా తమకు మాత్రం సాగునీరు దక్కడం లేదని, నియోజకవర్గంలో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలని కోరారు.

ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తమ నియోజకవర్గంలోని బత్తిలి, వడ్డంగిలోనూ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లు నిర్మించాలని అడిగారు. వంశధార ఎడమ కాలువపై నాలుగు చోట్ల నిర్మించిన వంతెనలు శిథిలావస్థకు చేరాయని, వాటిని ఎప్పుడు నిర్మిస్తారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ కాలువలపై నిర్మించిన షట్టర్లు పూర్తిగా పాడయ్యాయని, వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని కోరారు.

కరకట్టలు ఎప్పుడు కడతారు?

కరకట్టలు లేకపోవడంతో వంశధార, నాగావళి నదీ పరివాహక గ్రామ ప్రజలు ఏటా వరద ముంపు సమస్యలను ఎదుర్కొంటున్నారని, కరకట్టలు ఎప్పుడు నిర్మిస్తారంటూ ఎమ్మెల్యేలు కూన రవికుమార్, నిమ్మక జయకృష్ణ ప్రశ్నించారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ వంశధార ప్రవాహ దిశ మారడంతో కళింగపట్నం, నాగావళి దిశ మారడంతో పెద్దగణగళ్లపేట తీర గ్రామాలు కోతకు గురవుతున్నాయని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. వంశధార ప్రవాహ ఉధృతికి కొత్తూరు మండలం నివగాం కాలనీ ప్రాంతం కోతకు గురవుతోందని చెప్పారు.

ఉపాధి కార్డుల జారీకి ఇబ్బందులేమిటి?

వంశధార నిర్వాసిత కుటుంబాలకు జాబ్‌కార్డుల ఇవ్వడానికి ఉన్న ఇబ్బందులేమిటని ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రశ్నించారు. ఆమదాలవలస మండలం గాజుల కొల్లివలస, పెద్ద సంకిలి నిర్వాసితులకు జాబ్‌కార్డులు ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. గార మండలం మొగదలపాడులోనూ ఉపాధి కార్డులు ఇవ్వలేదని ఎమ్మెల్యే గొండు శంకర్ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు.

సభ్యుల ప్రశ్నలకు స్పందించని కలెక్టర్

ఎరువుల కొరత, కరకట్టల నిర్మాణం, సాగునీటి ప్రాజెక్టులు వంటి అంశాలపై సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు బదులిచ్చేవారే కరువయ్యారు. వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కేబినెట్ సమావేశం ఉండడంతో సమావేశానికి గైర్హాజరయ్యారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చొరవ చూపి తన పరిధిలో ఉన్న అంశాలను పరిష్కరిస్తాననో, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాననో చెప్పినా బాగుండేది.

సభ్యులు లేవనెత్తిన కొన్ని అంశాలను చివరి వరకు నోట్‌బుక్‌లో రాస్తూనే కనిపించారు. అధికార, ప్రతిపక్ష సభ్యులు ఏకమై అధికారులపై విమర్శలు దాడి చేస్తున్నా మధ్యలో కలుగజేసుకుని, సభ్యులను వారించే ప్రయత్నమూ చేయలేదు. ఏ సమస్యపైనా సభ్యులకు వాస్తవ పరిస్థితులను వివరించేందుకు ప్రయత్నించలేదు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, జెడ్‌పి సిఇఒ వెంకటేశ్వరరావు, పలువురు జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

స్మార్ట్‌మీటర్ల ప్రక్రియను నిలిపివేయాలి

- విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు
- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో వ్యవసాయ పంపుసెట్లకు, నివాసాలకు విద్యుత్ స్మార్ట్‌మీటర్ల బిగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.యుగంధర్ డిమాండ్ చేశారు. నగరంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి అధ్యక్షతన విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభను బుధవారం నిర్వహించారు. 2000 ఆగస్టు 28న బషీర్‌బాగ్ కాల్పుల్లో విద్యుత్ అమరవీరులు రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ఆదేశాలకు తలొగ్గి రాష్ట్రంలోని గృహాలకు విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్‌మీటర్లు, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు పెట్టాలని గత వైసిపి ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. అదానీ, షిర్డీసాయి తదితర కంపెనీలకు కాంట్రాక్టులను కట్టబెట్టిందని చెప్పారు. ఇందులో పెద్దఎత్తున అవినీతి చోటుచేసుకుందని విమర్శించారు. తెలుగుదేశం ప్రతిపక్షంలో ఉండగా ఈ మీటర్లను వ్యతిరేకించిందని, హైకోర్టులో పిటిషన్లు వేసిందని గుర్తుచేశారు. నేడు తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఒప్పందాలను రద్దు చేయకపోగా, స్మార్ట్‌మీటర్ల ప్రక్రియను కొనసాగిస్తోందని తెలిపారు. విజయవాడతో సహా పలు ప్రాంతాల్లో అదానీ సంస్థకు చెందిన మీటర్లను తెచ్చి విద్యుత్ కార్యాలయాల్లో భద్రపరుస్తున్నారని చెప్పారు. వ్యవసాయ పంపుసెట్లకు, ప్రభుత్వ కార్యాలయాల్లో మీటర్లు బిగిస్తున్నారని తెలిపారు. తర్వాత ఇళ్లకు మీటర్లు బిగించే ప్రక్రియకు సిద్ధమవుతున్నారని చెప్పారు. తొలి దశలో వ్యవసాయ పంపుసెట్లకు మీటర్ల పేరుతో క్రమంగా ఉచిత విద్యుత్‌కు ఎసరుపెట్టే ప్రమాదముందని హెచ్చరించారు. గృహాలకు మీటర్లతో ప్రీపెయిడ్ పద్ధతి, విద్యుత్ వాడే సమయాన్ని బట్టి అదనపు ఛార్జీలు, మీటర్ల ఖర్చును వినియోగదారులపై వేయడం తదితర రూపాల్లో భారం పడుతుందని తెలిపారు. రూ.వేలాది కోట్ల ప్రజాధనం మీటర్ల పేరుతో దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం మాట తప్పి కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు లొంగిపోయిందన్నారు. గతంలో వ్యతిరేకించిన మీటర్లనే కొనసాగించడం వాగ్దాన భంగమే అవుతుందన్నారు. బడా కార్పొరేట్ కంపెనీలకు ప్రయోజనాలు కల్పించే ఉద్దేశంతోనే కేంద్రం ఈ స్మార్ట్ మీటర్లను రుద్దుతోందని తెలిపారు. వ్యవసాయ పంపుసెట్లకు, నివాసాలకు స్మార్ట్ మీటర్లను నిలిపివేయాలని వామపక్షాలు డిమాండ్ చేస్తున్నాయని చెప్పారు. అదానీ, షిర్డీ సాయి తదితర కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని, బిగించిన మీటర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు కె.మోహనరావు, వి.జి.కె మూర్తి, కె.శ్రీనివాసు, పి.తేజేశ్వరరావు, కె.సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : స్థానిక సిపిఎం కార్యాలయంలో విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభను నిర్వహించారు. అమరవీరుల చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.షణ్ముఖరావు, హెచ్.ఈశ్వరరావు, బి.వాసుదేవరావు కొల్లి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రైతుసంఘం జిల్లా కార్యదర్శి మోహనరావు

జిల్లాలో యూరియా కొరత

- రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులు సరఫరా చేయాలి
- రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో యూరియా కొరత తీవ్రంగా ఉందని ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.చంద్రరావు, కె.మోహనరావు తెలిపారు. నగరంలోని రైతుసంఘం జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఆ సంఘ సమావేశంలో వారు మాట్లాడారు. రైతులకు ఎరువులు అందించడంలో ప్రభుత్వం, అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎరువుల కొరత ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. రూ.270కు రైతు సేవా కేంద్రాల ద్వారా అందించాల్సిన యూరియా బహిరంగ మార్కెట్‌లో రూ.400, డిఎపి రూ.1500కు కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. దీంతోపాటు గుళికలు గానీ జింక్ గానీ కొంటేనే యూరియా అమ్ముతున్నారని చెప్పారు. రైతుకి అవసరం లేకున్నా వీటిని కొనడం ద్వారా తలకు మించిన భారమవుతోందన్నారు. జిల్లాలో యూరియా లభించకపోవడంతో సోంపేట, కంచిలి, ఇచ్ఛాపురం, మందస, పలాస, వజ్రపుకొత్తూరు తదితర మండలాల రైతులు పక్కనున్న ఒడిశా రాష్ట్రం నుంచి అధిక ధరలకు యూరియా కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. రైతుల పంటలను ఈ-క్రాప్ చేసినా ఆ రెవెన్యూ పరిధిలోని రైతులకు ఎరువులు ఇవ్వడం లేదన్నారు. కొంతమంది పెద్దలకు మాత్రం అవసరానికి మించి ఎరువులు అందుతున్నాయన్నారు. అదే గ్రామాల్లోని సన్న, చిన్నకారు రైతులకు ఎరువులు అందించడం లేదన్నారు. జిల్లాలోని అనేక గ్రామాల్లో జరుగుతున్న ఈ విషయాలను వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేసినా స్పందన లేదన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఖరీఫ్ ప్రారంభానికి ముందే అధికారులు ప్రకటించినా రైతుల అవసరానికి ఎరువులు అందించడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి రైతులకు అవసరమైన ఎరువులు తక్షణమే రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర మేరకు రైతులకు అందించాలని, అధిక ధరలకు అమ్ముతున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతుసంఘం నాయకులు కె.అప్పన్న, ఎం.అజయ్, సూరయ్య, టి.నందోడు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు రక్షణగా ఉంటాం

ఎస్‌టి కమిషన్ సభ్యులు శంకర్ నాయక్

ప్రజాశక్తి - బూర్జ

గిరిజనుల హక్కుల కోసం, సమస్యల పరిష్కారం కోసం ఎస్‌టి కమిషన్ ఎప్పుడు అందుబాటులో ఉంటుందని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ సభ్యులు వడిత్య శంకర్ నాయక్ అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా రెండో రోజు బుధవారం మండలంలోని అల్లిపల్లిగూడ ఆదివాసీ కాలనీలో పర్యటించారు. గిరిజనులతో మాట్లాడి జీవనోపాధి, సదుపాయాలపై ఆరా తీశారు. స్థానిక సమస్యలపై సర్పంచ్ వెంకట సత్యంను అడిగి తెలుసుకున్నారు. గ్రామాన్ని ఐటిడిఎ పరిధిలో చేర్చి ఆదివాసీల అభ్యున్నతికి కృషి చేయాలని కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు. పాఠశాలకు వెళ్లాలంటే ప్రధాన రహదారి లేకపోవడం వల్ల చదువుకు దూరమవుతున్నామని, గ్రామంలోనే పాఠశాలను నిర్మించాలని కోరారు. అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేసి ఆయాలు, ఆశావర్కర్లను నియమించి అభివృద్ధికి తోడ్పడాలని చెప్పారు. గ్రామానికి ప్రధాన రహదారి మంజూరైనా ఇంతవరకు వేయలేదని వినతిపత్రం అందజేశారు. కొండపైన డ్రిల్లింగ్ బోరు వల్ల ఇళ్ల పైకి పెద్ద బండరాళ్లు పడుతుండడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఏ అధికారి గ్రామాన్ని సందర్శించలేదని చెప్పారు. ఇళ్ల పట్టాలు మంజూరైనా హౌసింగ్ ద్వారా ఇళ్ల నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ డ్రిల్లింగ్ బోర్ మిషన్ ద్వారా ప్రమాదాలు సంభవించే అవకాశమున్నందున వాటిని అరికట్టి గిరిజనుల ప్రాణాలు కాపాడాలని కోరారు. శ్మశానవాటిక, ఇంటింటికీ కుళాయి కనెక్షన్, పాఠశాల నూతన భవనం, అంగన్వాడీ కేంద్రం, ఆశా వర్కర్ నియామకం తదితర సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. రహదారి సౌకర్యం సరిగా లేకపోవడం వల్ల విద్యార్థులు మధ్యలోనే చదువు ఆపేస్తున్నారని, రోడ్లు వేయించాలన్నారు. విద్యుత్ సరఫరా సరిగ్గా లేకపోవడంతో ఇపిడిసిఎల్ ఎస్ఇతో ఫోన్‌లో మాట్లాడి తక్షణమే సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు రాజు నాయక్, రాష్ట్ర సహాయ కార్యదర్శి రవినాయక్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి, యువజన అధ్యక్షులు హనుమంతు నాయక్, జిల్లా అధ్యక్షులు మోహన్ పాల్, ప్రధాన కార్యదర్శి చిరంజీవి, గిరిజన సంఘాల నాయకులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌టి కమిషన్ సభ్యులు శంకర్ నాయక్

సుందర శ్రీకాకుళంగా అభివృద్ధి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సుందర శ్రీకాకుళం నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. నగరంలోని బలగ, ఎంపిడిఒ కార్యాలయం, మేజర్ కాలనీ తదితర ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లకు బుధవారం శంకుస్థాపన చేశారు. స్థానికుల కోరిక మేరకు మేజర్ కాలనీలో జంగిల్ క్లియరెన్స్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీసం మౌలిక సదుపాయాలకు నోచుకోక ప్రజలు అవస్థలు పడుతున్నారని, ఈ సమస్యలన్నింటినీ ఒక్కొక్కటిగా పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే నగరంలోని అన్ని డివిజన్లలోని కాలువల్లో పూడికతీత పనులు పూర్తి చేశామని చెప్పారు. సీజనల్ వ్యాధులు ప్రబలతున్న దృష్ట్యా మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా ఉండి సకాలంలో పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. ఎక్కడ చెత్త నిల్వలు ఉన్నా తక్షణమే తొలగించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు ఏ అవసరం వచ్చినా అందరికీ తాను అందుబాటులోనే ఉంటానని, నేరుగా కలవచ్చన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్, టిడిపి నాయకులు రెడ్డి శంకర్, మాదారపు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

పిడుగుపాటుకు మహిళ మృతి

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

పిడుగు పడి మండలంలోని ముచ్చింద్రి గ్రామానికి చెందిన సాడి జానకమ్మ (45) బుధవారం మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జానకమ్మ భర్త రెండేళ్ల కిందట మృతిచెందారు. పిల్లల్లేకపోవడంతో ఆమె ఒంటరిగానే జీవిస్తోంది. వ్యవసాయ కూలీ అయిన ఆమె 14 మంది కూలీలతో కలిసి గ్రామ శివారులోని పొలాల్లో వరి నాట్లు వేయడానికి వెళ్లింది. బుధవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ప్రారంభమైంది. పొలంలో మిగతా కూలీలు ఒకవైపు నాట్లు వేస్తుండగా, జానకమ్మ మరోవైపు నాట్లు వేస్తోంది. పెద్ద శబ్దంతో ఒక్కసారిగా పిడుగు పడడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. తోటి కూలీలు, పొలాల్లో ఉన్న గ్రామస్తులు గ్రామానికి తీసుకొచ్చి వాహనం ద్వారా స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆమె మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

జానకమ్మ మృతదేహం

చట్టం ముందు అందరూ సమానులే

ప్రజాశక్తి - శ్రీకాకుళం లీగల్

చట్టం ముందు అందరూ సమానమేనని న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. స్థానిక సాయికృష్ణ జూనియర్ కళాశాలలో రాజ్యాంగంపై న్యాయ విజ్ఞాన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత చట్టాలకు కొన్ని మార్పులు చేసి కొత్త చట్టాలు బిఎన్ఎస్, బిఎన్ఎస్ఎస్ ఏర్పడ్డాయని తెలిపారు. వీటి ప్రకారం శిక్ష కూడా కఠినంగా, త్వరితగతిన ఒక్కోసారి ముద్దాయికి జీవిత కారాగార శిక్ష కూడా అమలవుతుందని చెప్పారు. ఆర్థిక స్తోమత ఉన్న వారు మంచి న్యాయవాదులను పెట్టి వారి కేసులను తప్పుడు మార్గంలోనైనా గెలిచేసేందుకు ప్రయత్నిస్తారని చెప్పారు. పేదలకు ఆర్థిక స్తోమత ఉండదని, వారి కోసం న్యాయసేవాధికార సంస్థ ద్వారా న్యాయ సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. చట్టాలపై అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో భాగంగా న్యాయవాదులు జి.ఇందిరాప్రసాద్, ప్యానల్ అడ్వకేట్ టి.జగన్మోహనరావు, ప్రిన్సిపాల్ పి.నరేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సన్యాసినాయుడు

8న అథ్లెటిక్స్‌మీట్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే కీ.శే కొన్న చిన్నారావు మెమోరియల్ జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2024 పోటీలకు షెడ్యూల్‌ను నిర్వాహకులు ఖరారు చేశారు. అథ్లెటిక్స్ పోటీలు సెప్టెంబర్ 8వ తేదీన నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కమిటీ ప్రతినిధులు కొన్న వెంకటేశ్వరరావు (వాసు), కొన్న మధుసూదనరావు, ప్రగడ అశోక్‌కుమార్, పూడి బాలాదిత్య, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి తెలిపారు. నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా ఈ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 16 ఏళ్లుగా ఈ పోటీలను నిర్వహిస్తున్నామని, నాలుగు విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అండర్-14, 16, 18, 20 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా వంద మీటర్లు, 400, 800, రెండు వేలు, మూడు వేలు, ఐదు వేల మీటర్ల పరుగు పందాలు, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో తదితర కేటగిరీల్లో పోటీలను నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు పతకాలు, ప్రశంసాపత్రాలను అందజేస్తామని పేర్కొన్నారు. పోటీల్లో రాణించిన క్రీడాకారులను సెప్టెంబర్ 14 నుంచి 16వ తేదీ వరకు గుంటూరు జిల్లా నాగార్జున యూనివర్సిటీ క్రీడా మైదానం వేదికగా ఎపి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM.
I.A 213/2023 in O.S.23/2021

Between:-
Bora Abhishek, S/o of Ramarao, aged 30 years, Business, Palakonda road, Chintada village, Srikakulam rural, Mandal and district. ...Petitioner/Defendant

And:-
Baratam Kameswararao Gupta S/o, Govindarajulu, aged 44 years, Business, Bakarsahebpeta near New colokny, srikakulam town and District. ...Respondent/Plaintiff

Take Notice that the above I.A 213/2023 in O.S.23/2021 is posted for issuance of notice to you. therefore you are to appear before the Hon'ble Court of The PRINCIPAL SENIOR CIVIL JUDGE at Srikakulam on **09-09-2024 at 10.30 A.M** personally or through an Advocate

GORLE SOWJANYA LAXMI
Advocate for Petitioner/Defendant
Srikakulam,
cell:9160764533.

BEFORE THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE AT NARASANNAPETA
O.S.No.94/2022

Between:- **Palina Krishnamurthy,** S/o Late Valasayya ...Plaintiff
And: **Palina Krishnamurthy,** S/o Late Gangayya ...Defendant

NOTICE TO THE SAID DEFENDANT
Palina Krishnamurthy, S/o late gangayya, about 59 years, cultivation R/o Door number 3-45, Vanavishnupuram village, Koduru post, Polaki mandalam, Srikakulam district AP

It is to inform you that the above suit OS.94/2022 on the file of the honourable court of the junior civil judge at narasanapeta, Srikakulam District is stands posted to **10-09-2024** for your appearance and you are to appear on the above said date before honourable court at **10:30 AM.,** in person or through your advocate otherwise the above suit will be decided against you the suit will be heard and determined **exparte**

HENCE THIS NOTICE.
// By order of the said Honourable court //

RONANKI KRISHNAN NAIDU
Advocate for the plaintiff,
Narasannapeta,
Srikakulam,
Cell: 9440827999, 9182673933

సన్మానిస్తున్న పారామిలటరీ అసోసియేషన్ సభ్యులు

సైనికుల సంక్షేమానికి కృషి

ఎమ్మెల్యే రమణమూర్తి

ప్రజాశక్తి- నరసన్నపేట

పారామిలటరీ సైనికుల సంక్షేమానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. నరసన్నపేట పట్టణంలో పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద నూతనంగా నిర్మించిన పారామిలటరీ అసోసియేషన్ సంక్షేమ భవనాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధి నిర్వహణలో దేశం కోసం పాటుపడే పారా మిలటరీ అభ్యున్నతకు అన్ని విధాలుగా టిడిపి కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని అన్నారు. అనంతరం ఎమ్మెల్యేకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎం.వెంకట అప్పలనాయుడు, జి.చిట్టిబాబు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పతకాలు సాధించిన విద్యార్థులు

ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ దోహదం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మార్షల్ ఆర్ట్స్ సంపూర్ణ ఆరోగ్యానికి, ఆత్మరక్షణకు దోహదపడుతుందని, విద్యార్థులు చదువుతోపాటు క్రీడా రంగంలో రాణించాలని జిల్లా కరాటే చీఫ్ రెడ్డి ఢిల్లేశ్వరరావు అన్నారు. నగరంలోని మహాలక్ష్మినగర్ కాలనీలో కెన్యూ రియో కరాటే విద్యార్థులకు బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల జాతీయస్థాయిలో నిర్వహించిన కరాటే పోటీల్లో బంగారు పతకాలతో మెరిశారని తెలిపారు. చెన్నయ్ నేషనల్ లెవెల్ ఛాంపియన్‌సిప్, చెన్నయ్ సెంటమ్ ఇండోర్ స్టేడియంలో జరిగిన పోటీల్లో సత్తా చాటారన్నారు. కటా, కుమిటీల్లో పతకాలను కైవశం చేసుకున్నారని తెలిపారు. కెన్యూ రియా స్కూల్ నుంచి 17 మంది విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. వివిధ విభాగాల్లో 34 పతకాలు సాధించారని తెలిపారు. వారిలో 14 మందికి స్వర్ణం, 15 మందికి రజతం, ఐదుగురు కాంస్య పతాకాలను సాధించారన్నారు. గెలుపొందిన విద్యార్థులకు ఇండియా చీఫ్ కె.గిరీష్ పేరుముద్ర చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందజేశారని వివరించారు.

అక్రమాల నిధులు రికవరీ

కోటబొమ్మాళి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించిన ఉపాధి హామీ సామాజిక తనిఖీల ప్రజావేదికలో అక్రమాలు రుజువయ్యాయని ఎపిఒ జి.హరిప్రసాద్ బుధవారం తెలిపారు. ఈ నేపథ్యంలో 38 పంచాయతీలకు గాను, 34 పంచాయతీల్లో రూ.7.72 లక్షలు రికవరీలు చేశామని అన్నారు. మండలంలో కూలీలకు రూ.21 కోట్లు చెల్లింపులు కాగా, పంచాయతీ రాజ్ పనుల్లో భాగంగా భవనాలు, సిసి రోడ్డు, ప్రహరీలు వంటి పనులు చేపట్టామన్నారు. వన సంరక్షణ వంటి పనులకు రూ.3 కోట్లు చెల్లించామన్నారు. ఈ నెల 11వ తేదీ నుంచి మండలంలో ఇద్దరు ఎస్ఆర్‌పిలు, 11 మంది డిఆర్‌పిలు, 15 మంది విఎస్ఎలు తనిఖీలు నిర్వహించారని వివరించారు.

ధ్రువపత్రాలు అందజేస్తేనే పింఛన్ల కొనసాగింపు

డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ధ్రువపత్రాలతో రుజువు చేసుకుంటే పింఛన్లను కొనసాగిస్తామని జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. మండలంలోని దంతలో తప్పుడు పత్రాలతో 72 మంది వికలాంగులు పింఛను పొందుతున్నట్లు మంగళవారం స్థానిక ఎంపిడిఒలో నిర్వహించిన ఉపాధి హామీ సామాజిక తనిఖీలో సంబంధిత అధికారులు వెల్లడించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సదరన్ వైద్య బృందంతో బుధవారం దంత సచివాలయంలో బుధవారం విచారణ చేపట్టారు. 320 పింఛనులకు గాను, 72 వికలాంగు పింఛన్లు ఉన్నట్లు సంబంధిత జాబితాలో ఉందన్నారు. అయితే బుదవారం నిర్వహించిన విచారణలో 22 మంది లబ్ధిదారులు మాత్రమే హాజరయ్యారని

విచారణ చేస్తున్న అధికారులు

తెలిపారు. అందులో 12 మంది వికలాంగులు ఉన్నారని అన్నారు. హాజరు కానివారు జిల్లా మెడికల్ బోర్డుకు లబ్ధిదారుల వద్ద ఉన్న మెడికల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలన్నారు. లేకుంటే ఆయా పింఛన్లు రద్దు చేస్తామని పీడీ స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిసిహెచ్ఎస్, అసిస్టెంట్ డైరెక్టర్ డిజేబుల్, వెల్ఫేర్ కవిత, ఎంపిడిఒ కుప్పిలి ఫణీంద్రకుమార్ పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దే ప్రయత్నంలో ప్రతి విద్యార్థీ భాగస్వాములు కావాలని వంశధార విద్యాసంస్థల వ్యవస్థాపకులు చింతాడ అనిరుద్ధుడు పిలుపునిచ్చారు. కోటబొమ్మాళి వంశధార డిగ్రీ కళాశాల విద్యార్థులు డ్రగ్స్ రహిత సమాజం కోసం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. 'డ్రగ్స్ అంటే మరణం, డ్రగ్స్ ఆర్ లైక్ నైవ్స్, ఇట్ కిల్స్ యువర్ ఎంటైర్ లైవ్స్' అని నినదించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసగా మారి భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం భాగస్వాములు అవుదాం అంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కళాశాల నుంచి పలు పోస్టర్లతో

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి.వి.రమణమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ ఎన్.వెంకటేశ్వరరావు, ఎఒ కొర్రయి శ్రీనివాసరావు, అధ్యాపకులు కోట సింహాచలం, వెంకటరమణ, నగేష్, ఆనందరావు, ధరణి, ధనలక్ష్మి, పి.డి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

'యుపిఎస్'తో ఉద్యోగులకు అన్యాయం

ప్రజాశక్తి- పోలాకి

సిపిఎస్ స్థానంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న నూతన పెన్షన్ విధానం (యుపిఎస్) సరైనది కాదని, దాని వల్ల ఉద్యోగులకు న్యాయం జరగదని, పాత పెన్షన్ విధానం మాత్రమే సరైన విధానమని యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజేష్, ఉమాభాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. నూతన పెన్షన్ విధానానికి వ్యతిరేకంగా ఈ నెల 30న అన్ని తాలూకా కేంద్రాల్లో నిరసనలు తెలుపుతున్నామని తెలిపారు. అలాగే 117 జిఒతో ప్రభుత్వ పాఠశాలు అస్తవ్యస్తం అయ్యాయని, వ్యవస్థను గాడిలో పెట్టాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 117 జిఒను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అవసరం మేరకు మాత్రమే పని సర్దుబాటు చేయాలన్నారు. ఒత్తిడిని కలిగించే బోధనేతర పనులను తగ్గించాలన్నారు.

రోడ్లు జలమయం

ప్రజాశక్తి- ఆమదాలవలస

బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి ఆమదాలవలస-సరుబుజ్జిలి రహదారుల పైకి వర్షపు నీరు చేరి పలువురు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఐదు గంటలకు ప్రారంభమైన వర్షపు జల్లులు ఎడతెరిపి లేకుండా కురవడంతో ప్రజలు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆమదాలవలస పట్టణంలోని పూజారిపేట, కంద్రపేట, లక్ష్మీనగర్ వీధి, మెట్టక్కివలస వంటి ప్రాంతాల్లో మురుగునీరు రహదారులపై ప్రవహిస్తుంది. అలాగే సరుబుజ్జిలి మండల కేంద్రంలో భారీ వర్షం కురవడంతో కొండ ప్రాంతమైన నందికొండ కాలనీలోని వీధుల్లో డ్రెయినేజీ నీరంతా రోడ్డపైకి చేరింది. మురుగు నీరు అంతా ప్రధాన రోడ్డుపై రావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

రహదారి పైకి చేరిన వర్షపు నీరు

త్రిశంకుస్వర్గంలో మిగులు ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- టెక్కలి

ప్రతి ప్రభుత్వ పాఠశాలల్లో అదనంగా ఉన్న మిగులు ఉపాధ్యాయులను అవసరం ఉన్న చోటకు బదిలీ చేయాలన్న ప్రభుత్వ ఉత్తర్వులు అమలుపై సందిగ్ధత నెలకుంది. దీంతో మండలాల్లోని మిగులు ఉపాధ్యాయులు సర్వీసులు ఆయోమయంలో పడ్డాయి. ఉపాధ్యాయుల్లో మిగులు ఉపాధ్యాయులను ఖాళీగా ఉన్న పాఠశాలలకు బదిలీ చేయాలన్న ఉద్దేశంతో ఇటీవల నిర్వహించిన కౌన్సెలింగ్‌ని సంఘాలు బహిష్కరించాయి. గత ప్రభుత్వ హయాంలో జారీ అయిన జిఒలను రద్దు చేస్తామని టిడిపి కూటమి ప్రభుత్వం హామీనిచ్చింది. కానీ, వాటిని రద్దు చేయలేదు సరికదా... ఇప్పుడు వాటినే అమలు చేయడంపై సంఘాలు ఆందోళన వెలిబుచ్చాయి. దీంతో మండలాల వారీగా ఖాళీగా ఉన్న పాఠశాలల్లో మిగులు ఉపాధ్యాయులు చేరేందుకు సమ్మతిని వ్యక్తం చేసి పాఠశాలలు కోరారు. వారిని బదిలీ చేస్తూ... పాఠశాలలకు పంపేందుకు ఎటువంటి ఆదేశాలు జారీ కాలేదు. దీంతో మిగులు ఉపాధ్యాయులు అదే ప్రదేశాల్లో ఉండిపోయారు. ఇటీవల జరిగిన ఉద్యోగ విరమణ సమయంలో చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయులు పోస్టులు ఖాళీలు ఏర్పడ్డాయి. ఆయా పాఠశాలల్లో సంబంధిత సబ్జెక్టు ఉపాధ్యాయులు అవసరం ఉంది. అటువంటి ప్రదేశాల్లో మిగులు ఉపాధ్యాయులను పంపించకుండా ఖాళీగా ఉంచడంతో ఆయా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు నష్టానికి గురికావల్సి వస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మిగులు ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియపై స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.

అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

నేత్రదానంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నేత్రదానంపై అవగాహన అవసరమని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహరావు అన్నారు. 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా నగరంలోని డిఎంహెచ్ఒ కార్యాలయం ఆవరణలో బుధవారం నేత్రదానంపై అవగాహన కల్పించారు. నేత్రదాన అవశ్యకతను, కార్నియల్ అంధత్వానికి ప్రధాన కారణాలు, నేత్రదానంతో ప్రయోజనాలను వివరించారు. దెబ్బతిన్న కార్నియాను ఆరోగ్యవంతులకు కార్నియాతో భర్తీ చేయవచ్చని ఐ టెక్నీషియన్ పి.సుజాత వివరించారు. అనంతరం ఏడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎఒ నర్సింగరావు, మేనేజర్ వి.ఎస్.ఆర్.ఎల్.గుణకరరావు, ప్రోగ్రాం మేనేజర్ గొలివి రమణ, పి.చైతన్యకుమార్, బి.సతీష్, ఉమాశంకర్, జగదీష్, వెంకటరమణ పాల్గొన్నారు.

ఇఒలుగా బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- నరసన్నపేట

నరసన్నపేట మేజర్ పంచాయతీ విస్తరణ అధికారిగా (ఇఒ) పి.ద్రాక్షాయిని బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మౌళిక సదుపాయాలు కల్పించేందుకు, పంచాయతీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ముందుగా పంచాయతీ సిబ్బంది ఆమెకు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

టెక్కలి రూరల్ : టెక్కలి మేజర్ పంచాయతీ కార్యదర్శిగా జగన్నాథరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. పంచాయతీ పరిధిలోని చెత్తను రోడ్లపై వేయకుండా ట్రాక్టర్ వచ్చినప్పుడు సిబ్బందికి అందించాలన్నారు. పంచాయతీ పరిధిలోని అన్ని వీధుల్లో పేరుకుపోయిన చెత్తను ప్రొక్లెయిర్లతో శుభ్రం చేయాలని సిబ్బంది ఆదేశించారు. పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించస్తానని తెలిపారు.

నేడు ఎచ్చెర్లలో 'గిడుగు' జయంతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు 161వ జయంతి సందర్భంగా ఎచ్చెర్లలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో తెలుగు భాషా దినోత్సవం సభను నిర్వహిస్తున్నట్లు సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ కె.శ్రీనివాసు ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు విభాగం సమన్వయకర్త డాక్టర్ బలరాంనాయుడు అధ్యక్షతన నిర్వహించే కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ కె.ఆర్.రజిని ముఖ్యఅతిథిగా, యూనివర్సిటీ తెలుగు అధ్యాపకులు బాడాన శ్యామలరావు ప్రధాన వక్తగా పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ కళాశాలల్లో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులను అందించనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కవులు పండితులు, రచయితలు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సామగ్రిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

బెల్లంఊటలు ధ్వంసం

మందస: మండలంలోని కరియాపల్లిలో సోంపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూర్య ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్, సిబ్బంది నాటుసారా తయారీపై బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అప్పటికే నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1500 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో నాటుసారా బట్టీలు నిర్వహిస్తున్నారనే కోణంలో విచారణ చేసి వారిపై తగు చర్యలు తీసుకుంటామని అన్నారు. నాటుసారా పూర్తిస్థాయిలో నివారించడానికి కృషి చేస్తున్నామని అన్నారు. నాటుసారా తయారీ చేసినా, విక్రయించినా ఈ 9440902358 సెల్ నంబరును సంప్రదించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. అనంతరం సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో పలాస టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రకుమార్, ఎస్ఐ చంద్రమోహన్, సెబ్ సిబ్బంది మోహనరావు, కాంతారావు, యోగేశ్వరరావు, నాయుడు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న పిఒ రమణ

ఏకలవ్య పాఠశాల సందర్శన

మెళియాపుట్టి : మెళియాపుట్టిలోని ఏకలవ్య పాఠశాల భవనాన్ని బుధవారం పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఐటిడిఎ పిఒ వి.వి.రమణ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు వేగవంతంగా పూర్తి చేసి సెప్టెంబరు 10వ తేదీలోగా అందజేయాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. ఈయనతో పాటు ఇఇ సింహాచలం, జెఇ శ్రీకాంత్, ఎటిడబ్ల్యు కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణవేణి, ఆర్ఐ వైకుంటరావు, కృష్ణారావు ఉన్నారు.

మాట్లాడుతున్న ఎంఇఒ ధనుంజయ మజ్జి

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

కవిటి : విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని, అందులోనూ ఇంటర్మీడియట్ దశ చాలా కీలకమని ఎంఇఒ-1, అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అధికారి ధనుంజయ మజ్జి అన్నారు. కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన విద్యార్థుల ఆహ్వాన కార్యక్రమం బుధవారం కోలాహలంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సామాజిక స్పృహ కలిగి ఉండాలన్నారు. విద్యార్థి జీవితంలో కీలక దశ అయిన ఇంటర్మీడియట్ విజయవంతంగా పూర్తి చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు, కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బెందాళం మల్లేశ్వరరావు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

వాటర్ క్యాన్లు వితరణ

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు బొండాడ శంకరరావు జన్మదినం సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని కెజిబివికి తాగునీటి క్యాన్లను బుధవారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ధూపం రాజేష్, సెక్రటరీ టంకాల రాజేష్, సభ్యులు జగన్, శ్యామ్, మోహన్ పాల్గొన్నారు.

క్యాన్లను అందజేస్తున్న శంకరరావు

సంక్షిప్త వార్తలు

ఎస్ఎ పరీక్షలు ప్రారంభం

టెక్కలి: ప్రభుత్వ విద్యాశాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఎస్ఎ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఆగస్టు మొదటి వారంలో ప్రారంభం కావల్సిన పరీక్షలు నెలాఖరు నిర్వహించారు. ఈ పరీక్షలు వచ్చే 4వ తేదీ వరకు ఉంటాయి. ఒకటి నుంచి 8వ తరగతి వరకు ఒఎంఆర్ షీటు విధానాన్ని అమలు చేస్తుంది. డిసిఇబి నుంచి ప్రశ్నపత్రాలు సరఫరా అవుతున్నాయి. మూల్యాంకనం అవుట్ సోర్సింగ్ సిబ్బందితో చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

పోలాకి : నదీ పరీవాహక ప్రాంతాలు, సముద్ర తీర ప్రాంతాల నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ జి.రంజిత్ హెచ్చరించారు. మండలంలోని రాజారాంపురం తీరం నుంచి కొత్తరేవు పంచాయతీ పరిధిలోని పరపతివానిపేటకు ట్రాక్టర్‌పై ఇసుక అక్రమంగా తరలిస్తుండగా, మార్గంమధ్యలో రేవు అంపలాం వద్ద బుధవారం పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తులించి కేసు నమోదు చేశారు. దాడుల్లో కానిస్టేబుళ్లు ఎం.వెంకటరమణ, ఎస్.రమణమూర్తి పాల్గొన్నారు.

నేడు పొందూరు మండల సమావేశం

పొందూరు : పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం మండల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సీపాన హరిహరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిపి కిల్లి ఉషారాణి అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విధిగా సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొవాలన్నారు. పూర్తిసమాచారంతో మండలస్థాయి అధికారులు పాల్గొవాలని సూచించారు.

శ్రీకాంత్ పరామర్శ

పాతపట్నం: మండలంలోని బోరుభద్రలో వైసిపి నాయకులు సవిరిగాని సంతోషి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న తూర్పుకాపు మాజీ చైర్మన్ మామిడి శ్రీకాంత్ బుధవారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం పెద్దసిది గ్రామం సర్పంచ్ బోను గిరి కాలు విరగడంతో ఆయనను పరామర్శించారు.

సేవా కార్యక్రమాలు విస్తృతం

వజ్రపుకొత్తూరు: రామసేవా సమితి ఆధ్వర్యాన నిర్వహించే సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేస్తామని నూతన అధ్యక్షుడుగా ఎన్నికైన మోస వరప్రసాద్ అన్నారు. మండలంలోని అక్కుపల్లిలో మాజీ ఎంపీపీ సూరడ మోహనరావు అధ్యక్షతన రామ సేవా సమిత నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులు గుంటి గురునాథం, ప్రధాన కార్యదర్శిగా ఆర్జాల ఈశ్వరరావు, ఉప కార్యదర్శిగా సింగుపల్లి జగన్నాథం, కోశాధికారిగా కాస చలపతితో పాటు 12 మంది కార్యవర్గ సభ్యులు బాధ్యతలను స్వీకరించారు.

పశుగణనను విజయవంతం చేయాలి

పాతపట్నం: సెప్టెంబరు ఒకటి నుంచి జరగనున్న 21వ అఖిలభారత పశు గణన విజయవంతం చేయాలని ఎంపిడిఒ జయంతి ప్రసాద్, ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పట్టణంలోని బుధవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. మాట్లాడుతూ వారు మాట్లాడుతూ ప్రతి ఒక్క ఎన్యూమరేటర్ ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు డాక్టర్ బి.శ్రీవాణి, మౌనిక పాల్గొన్నారు.

సరస్వతిదేవి విగ్రహావిష్కరణ

మెళియాపుట్టి: మండలంలోని దీనబంధుపురంలో జన్ని సావిత్రమ్మ, పకీరుల జ్ఞాపకార్థం ప్రాథమిక పాఠశాలలో సరస్వతిదేవి విగ్రహాన్ని కుటుంబ సభ్యుల ఆధ్వర్యాన ఎంఇఒలు ఎస్.దేవేంద్రరావు, ఎం.పద్మనాభరావులు బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు యు.ఖగేశ్వరావు, విగ్రహ దాతలు జె.ధర్మారావు, హరిబాబు, రాణి, ఉపాధ్యాయని లక్ష్మీదేవి, విద్యాకమిటీ చైర్మన్ ప్రతినిధి తేజేశ్వరరావు, వైస్ చైర్మన్ శశివర్ణమ్మ పాల్గొన్నారు.

రక్తదాతకు సత్కారం

శ్రీకాకుళం అర్బన్ : అత్యవసర సమయాల్లో నిరంతరాయంగా రక్తదానం చేయడంతో పాటు తన స్నేహితులు, బంధువుల చేత కూడా రక్తదానం చేయించే రక్తదాత నవీన్ ఎందరికో ఆదర్శమని లయన్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్, సెక్రటరీ డాక్టర్ పైడి సిందూరలు అన్నారు. లయన్స్‌క్లబ్‌లో నవీన్‌కు బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని ప్లేట్ లెట్స్ అవసరమైన వారికి రోజూ పది మందికి రక్తదానం చేయిస్తున్నారన్నారు. మదర్ ఫౌండేషన్ పేరుతో నవీన్ నిర్వహిస్తున్న కార్యక్రమాలను ప్రస్తావించారు.నటుకుల మోహన్ పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

ఎచ్చెర్ల : మండలంలోని ఆర్‌జియుకెటి ఆవరణలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన వచ్చింది. ఈ మేరకు శ్రీకాకుళం సహాయమిత్ర, రాగోలు జెమ్స్ వైద్యులు 120 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వర్షాలు కురుస్తున్న సందర్భంగా జ్వరాలు వ్యాప్తి చెందుతాయని, అందరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ కె.వి.జి.డి.బాలాజి, పరిపాలనా అధికారి ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ మోహన్‌కృష్ణ చౌదరి, డీన్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ గేదెల రవి, సహాయ మిత్ర కో-ఆర్డినేటర్ దిలీప్‌కుమార్ కోడా, డాక్టర్ రాకోటి శ్రీనివాసరావు, డాక్టర్ రంధి రమేష్ పాల్గొన్నారు.

ఎస్ఐలుగా బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- పాతపట్నం

పాతపట్నం పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా బి.లావణ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పార్వతీపురం మన్యం జిల్లా మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా బాధ్యతలు నిర్వర్తించి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఎస్ఐ మహమ్మద్ యాసిన్ హిరమండలం మండలానికి బదిలీ అయ్యారు. ఎస్ఐకు పోలీస్ స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎస్ఐ లావణ్య మాట్లాడుతూ ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో గంజాయి, మద్యం, నిషేధిత పొగాకు ఉత్పత్తులు రవాణా

లావణ్య

సత్యనారాయణ

అరికట్టేదుకు అధిక ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. చట్టానికి వ్యతిరేకంగా పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో మండల ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు.

పొందూరు:పొందూరు పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా వి.సత్యనారాయణ బుధవారం బాధ్యతలను చేపట్టారు. ఈయన ఇచ్ఛాపురం టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఈయనకు పోలీస్ సిబ్బంది స్వాగతం పలికి అభినందనలు తెలియజేశారు.

మొక్కను పంపిణీ చేస్తున్న బ్యాంకు మేనేజర్ కిరణ్

మొక్కల పంపిణీ

ఆమదాలవలస : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మహిళా సంఘ సభ్యులకు స్టేట్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ కిరణ్ బుధవారం మొక్కలను పంపిణీ చేశారు. పట్టణంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో వెలుగు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఎపిఎం పైడి కూర్మారావు అధ్యక్షత వహించారు. మొక్కలను నాటి వాటి సంరక్షణ బాధ్యతను ప్రతిఒక్కరూ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వెలుగు క్లస్టర్ కో-ఆర్డినేటర్లు రమణ, చంద్రావు, రామప్పడు, హరికృష్ణ, ఉమ, సుభద్ర, స్టేట్ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ కామేశ్వరరావు, మధు, శివ పాల్గొన్నారు.

పాలకుల కుట్రలను ప్రతిఘటిద్దాం

పలాస : ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలను అంతమొందించే పాలకుల కుట్రలను ప్రతిఘటిద్దామని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యులు తాండ్ర ప్రకాష్ పిలుపునిచ్చారు. సీతారాముల 26వ వర్ధంతి సందర్భంగా ప్రచారంలో భాగంగా మండలంలోని బొడ్డపాడు అమరవీరుల స్మారక భవనం ఆవరణలో బుధవారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫాసిజాన్ని, కార్పొరేట్ హిందూ దేశాన్ని స్థాపించాలనే కుట్రలో భాగంగానే విప్లవ చైతన్యాన్ని తుడిచేయాలనే తలంపుతో ఉన్నారని అన్నారు. పీడిత అస్తిత్వ ప్రజలను విముక్తి దిశగా నడిపించే, కార్పొరేటీకరణను సమరశీలంగా ఎదుర్కొనే విప్లవోద్యమాన్ని నిర్మించడం ద్వారానే పాలకుల దుర్మార్గాలను నిలవరించగలమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు గొరకల బాలకృష్ణ, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, విప్లవ పోరాట యోధులు కామ్రేడ్ కుమారన్న, జయక్కల స్మారక కమిటీ కార్యదర్శి పోతనపల్లి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



నిర్వాసితుల సమస్యలు తెలుసుకుంటున్న ఆర్‌డిఒ

నిర్వాసిత గ్రామం సందర్శన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని చీపురుపల్లి ఆఫ్‌షోర్ నిర్వాసిత గ్రామాన్ని టెక్కలి ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ సుదర్శన్‌దొర బుధవారం పరిశీలించారు. ఈ మేరకు నిర్వాసితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సుమారు 13 కుటుంబాలకు నష్టపరిహారం అందించాలని బాధితులు ఆర్‌డిఒకు విన్నవించారు. ఈయనతో పాటు తహశీల్దార్ హనుమంతరావు, ఎంపిడిఒ పి.చంద్రకుమారి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఉద్దానం తాగునీటి ప్రాజెక్టు నిర్మాణంలో భాగస్వామ్యం

ఆర్‌డబ్ల్యుఎస్ ఇన్‌ఛార్జి ఎస్ఇ జాన్ బెనహర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఉద్దానం తాగునీటి ప్రాజెక్టు నిర్మాణంలో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందని ఆర్‌డబ్ల్యుఎస్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ ఇంజినీర్ ఇంజనీర్ జాన్ బెనహర్ తెలిపారు. ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. 1962 ఆగస్టు 26న విజయవాడలో జాన్ సైమన్, మేరీ సరోజిని దంపతులకు రెండో సంతానంగా జన్మించానని అన్నారు.

విద్యాభ్యాసం

1967లో జన్మస్థలం విజయవాడలో చిల్డ్రన్ మోడల్ హైస్కూల్‌లో ప్రాథమిక ప్రారంభించారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు అక్కడే చదివారు. 1977 నుంచి 1979 వరకు విజయవాడలోనే ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. 1980 నుంచి 1984 వరకు అనంతపురం జెఎన్‌టియులో డిగ్రీ పూర్తి చేశారు. 1987 నుంచి 1999 వరకు జెఎన్‌టియు హైదరాబాద్‌లో ఎంటెక్ మాస్టర్ డిగ్రీ పట్టా పొందారు.

ఉద్యోగ జీవితం

1986 జనవరిలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. ఆరేళ్లు పనిచేసిన తర్వాత 1992 నుంచి 1996 వరకు తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేటలో పనిచేశారు. 1998 నుంచి డిప్యూటీ ఇంజినీర్‌గా ఉద్యోగ ఉన్నత పొంది ఆర్‌డబ్ల్యుఎస్ రంపచోడవరంలో పనిచేశారు. 2002 నుంచి 2007 వరకు పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడెంలో పనిచేశారు. 2007 నుంచి 2011 వరకు విజయవాడ సూపరింటెండెంట్ ఇంజినీర్ కార్యాలయంలో డిఇగా పనిచేశారు. 2011 నుంచి 2015 వరకు కృష్ణా జిల్లా నూజివీడులో పనిచేశారు. 2015 నుంచి 2022 వరకు కృష్ణా జిల్లా అవనిగడ్డలో పనిచేశారు. 2022 ఏప్రిల్‌లో సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా ఉద్యోగోన్నతి పొంది కర్నూలు, బాపట్ల జిల్లాల్లో పనిచేశారు. 2022 ఆగస్టు నుంచి శ్రీకాకుళం జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తూ... 2024 ఏప్రిల్ నుంచి శ్రీకాకుళం జిల్లాకు ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ... ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు.

సంతృప్తిపరిచే అంశం

తూర్పుగోదావరి జిల్లా రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలో సుదీర్ఘంగా తొమ్మిదేళ్లు పనిచేశారు. అక్కడ ప్రజలకు తాగునీరు అందించడంతో నా ఉద్యోగ జీవితంలో మిక్కిలి సంతృప్తినిచ్చిందన్నారు. అవనగడ్డ ఎలిశెట్టి దిబ్బ గ్రామంలో నదిపై

జాన్ బెనహర్

పడవలతో వెళ్లి తాగునీరు కుళాయిలు బిగించి నీటిని అందించారని అన్నారు.

అవార్డులు

2003 గోదావరి పుష్కరాల్లో విశిష్ట సేవలు అందించినందుకు అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. 2006 ఏలూరు కలెక్టర్ లాల్ అగర్వాల్ చేతుల మీదుగా ఉత్తమ అధికారి అవార్డు అందుకున్నారు. 2007 అప్పటి మంత్రివర్యులు పిన్నమనేని వెంకటేశ్వర్లు చేతుల మీదుగా అవార్డు అందుకున్నాను. 2015లో కృష్ణా కలెక్టర్ శ్రీనివాస్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. 2018 కృష్ణా జిల్లా అవనిగడ్డలో పనిచేసినప్పుడు జిల్లాస్థాయి అవార్డు అందుకున్నారు.

కుటుంబ నేపథ్యం

జాన్ బెనహర్ భార్య హేమలత విజయవాడలో హోమియోపతి డాక్టర్. పెద్ద కుమారుడు పాల్ మనోహర్ విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. చిన్న కుమారుడు అజయ్ అహరోన్ అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు.

ప్రతి అక్షరం - ప్రజల పక్షం

ప్రజాశక్తి

తెలుగు దినపత్రిక

44th Years Anniversary

ప్రత్యేక అనుబంధం

Advt. Feature

టెక్కలి డివిజన్

గురువారం 29-8-2024 16 పేజీలు

ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు ...

హృదయపూర్వక ధన్యవాదములు

మామీద... మాసంస్థ మీద ఎంతో నమ్మకంతో, అభిమానంతో మీ బిడ్డలను పద్మావతి విద్యాసంస్థలలో ఇంటర్ మరియు డిగ్రీ కోర్సుల్లో చేర్పించినందుకు తల్లిదండ్రులందరికీ మా హృదయపూర్వక ధన్యవాదములు. మీ విశ్వాసానికి తగినట్లుగా విద్యార్థులను బహుముఖంగా తీర్చిదిద్దుతామని మనవి చేస్తున్నాం.

విశిష్టతలు:

- పోటీ పరీక్షల సాధనకు తగిన శిక్షణ
- ఉద్యోగాలు సాధించడమే కాకుండా భవిష్యతలో రాణించేలా వ్యక్తిత్వ నిర్మాణం
- పరిశ్రమలకు అవసరమయ్యే నైపుణ్యాల కోసం పరిశ్రమలతో అనుసంధానం.

పద్మావతి

జూనియర్ & డిగ్రీ కళాశాల

నరసన్నపేట, శ్రీకాకుళం జిల్లా Cell: 9393929359

- తొమ్మిదేళ్లుగా పెండింగ్‌లో ప్రతిపాదనలు
- రూ.450 కోట్ల నుంచి రూ.950 కోట్లకు పెరిగిన అంచనా వ్యయం
- వంశధార మోడర్నైజేషన్‌తోనే శివారుకు సాగునీరు
- కొత్త ప్రభుత్వం దృష్టిసారిస్తే తీరనున్న సాగునీటి కష్టాలు

హిరమండలం సమీపంలో ఎడమ కాలువపై నుంచి ప్రవహిస్తున్న నీరు (ఫైల్)

ఆధునికీకరణకు...

మోక్షం లభించేనా?

(2లో)

శ్రీముఖలింగేశ్వర ఆలయం

శిల్ప సౌందర్యం శ్రీముఖలింగం సొంతం

దేశంలో ఎక్కడా లేని విధంగా రెండు ధ్వజస్తంభాలను కలిగి ఉన్న శ్రీకూర్మనాథ క్షేత్రం. దేశంలోనే ముఖాకృతి కలిగిన ఏకైక ఆలయం శ్రీముఖలింగం. ఈ ఆలయాల్లో కుడ్య చిత్రాలు, శిల్పకళా సౌందర్యాన్ని చూసి తీరాల్సిందే. శ్రీముఖలింగంలో ఆనాడే అత్యంత సూక్ష్మస్థాయిలో శిల్పాలను చెక్కిన తీరు మహాద్భుతం.



ప్రజాశక్తి - జలుమూరు

ప్రసిద్ధ శైవ క్షేత్రం శ్రీముఖలింగం.. దక్షిణ కాశీగా పేరొందింది.. ఎక్కడైనా శివుడు లింగాకారంలో ఉంటాడు. ఈ క్షేత్రంలో మాత్రం ముఖం దాల్చి ఆవిర్భవించాడు. అందుకే ఈ క్షేత్రానికి శ్రీముఖలింగమని.. ఇక్కడ కొలువైన శివుడును ముఖలింగేశ్వరుడని పిలుస్తారు. కాశీలో లింగం, గంగలో స్నానం.. శ్రీశైలంలో శిఖరం, శ్రీముఖలింగంలో ముఖదర్శనం చేసుకుంటే మోక్షం సిద్ధిస్తుందని పురణాలు చెబుతున్నాయి. ఇక్కడ జరిగే మహాశివరాత్రి ఉత్సవాల్లో పాల్గొనేందుకు యాత్రికులు రాష్ట్ర నలుమూలలతో పాటు విదేశాల నుంచి కూడా వస్తారు. ఈ క్షేత్రం కాశీకి తుల్యమైనదిగా అభివర్ణిస్తున్నారు.

అత్యంత ప్రాచీన చరిత్ర ఈ క్షేత్రం సొంతం. ఇక్కడ సోమేశ్వరాలయం, భీమేశ్వరాలయం, మధుకేశ్వరాలయాలను క్రీస్తుశకం 573లో పూర్వగంగావంశానికి చెందిన హస్తివర్మ నిర్మించినట్లు చెప్తారు. మధుకేశ్వర, భీమేశ్వరాలయాలు తూర్పు చాళక్యుల వాస్తు శాస్త్రానికి నిదర్శనంగా నిలుస్తాయి. గోడలపై పుష్పాలు, లతలు, కుంభలతలు, ఆంధ్రుల, పల్లవ, చాళుక్య కాలానికి చెందినవి. ఆనాడే అత్యంత సూక్ష్మస్థాయిలోనే శిల్పాలను చెక్కిన తీరు మహాద్భుతం. మధుకేశ్వరాలయంలో లభించిన ప్రాచీన శాసనాలు వందకు పైగా ఉన్నాయి. అన్నీ నంది, నాగరిలిపికి చెందనవి. అనంతవర్మ చోడగాంగదేవుడు మధుకేశునికిచ్చినట్లు ఆ శాసనంలో ఉంది. శ్రీముఖలింగంలో మహాశివరాత్రి రోజున మూడు రోజుల పాటు యాత్ర నిర్వహిస్తారు.

ముక్కోణాకారంలో మూడు ఆలయాలు

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీముఖలింగంలో మూడు ప్రధాన ఆలయాలతో పాటు ఎన్నో శివలింగాలు ఉన్నాయి. కోటికి ఒక్కటి తక్కువగా ఉండటం వల్ల కాశీగా పేరొందాల్సిన శ్రీముఖలింగం దక్షిణ కాశీగా మిగిలిపోయిందని ఆర్చకులు చెబుతున్నారు. మరీ ప్రధానంగా ఆలయ గర్భ గుడిలో ఉన్న గోలెంను ముట్టుకొని మనుస్సులో కోర్కెలు తల్చుకొని మొక్కితే ఆ.. న్యాయమైన కోర్కెలు తీరుతాయని శ్రీముఖలింగేశ్వర క్షేత్ర మహత్యంలో ఉంది. ప్రధాన ఆలయానికి తూర్పు దిక్కున ఉన్నది భీమేశ్వరాలయం. దక్షిణ దిశలో ఉన్నది సోమేశ్వరాలయం. ఆలయాల్లో కూడా సాధారణ రోజలుతో పాటు కార్తీక, శివరాత్రి పుణ్యదినాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అలాగే శ్రీముఖలింగేశ్వరునికి క్షేత్ర పాలకుడుగా విష్ణుమూర్తి వ్యవహరిస్తున్నట్లు చరిత్ర వివరిస్తోంది. కరకవలస గ్రామ సమీపాన రత్నగిరి కొండమీద కృష్ణార్జునులు ఉంటారు. అలాగే ఈ క్షేత్రాన్ని ఆశ్రయించి కోటి, జంబు, సోమ, సూర్య, పుష్కర, కుబేర, పిశాచవిమోచన, హంస, గయ, మాంకణ, చక్రపద్మసరోవర, విందు పక్షి యక్షిణి సంజీవవాది తీర్థాలు ఉన్నాయి. ఆలయం మొత్తం ఇండో-అర్బన్ శిల్ప కళతో ఎరుపు రాతితో చెక్కడం విశేషం.

కట్టిపడేస్తున్న శిలా సౌందర్యం

శ్రీముఖలింగేశ్వర ఆలయ గోడలపై ఉన్న శిల్పసౌందర్యం యాత్రికులు, పర్యాటకులకు అచ్చెరువొందిస్తున్నాయి. ఈ ఆలయం 6వ శతాబ్దంలో నిర్మించబడిందని ఆర్కిలాజికల్ డిపార్టుమెంట్ వారు చెబుతున్నారు. ఈ ఆలయాన్ని చోళ రాజైన చోళ గంగ అనంతవర్మ చక్రవర్తి నిర్మించినట్లు శిలాశాసనాలు చెబుతున్నాయి. ఆలయంలో ఉన్నటువంటి శిలాశాసనాలు పాళీ భాషలో ఉన్నాయి.

ఆధునికీకరణకు మోక్షం లభించేనా?

జిల్లాలో ప్రధాన సాగునీటి వనరుగా ఉన్న వంశధార ప్రాజెక్టు ద్వారా పూర్తిస్థాయిలో సాగునీరందని పరిస్థితి నెలకొంది. సుమారు నాలుగున్నర దశాబ్దాల కిందట నిర్మించిన కుడి, ఎడమ కాలువలు దయనీయంగా మారడమే ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. కాలువలను ఆధునికీకరణ కోసం పలుమార్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. టిడిపి అధికారంలో ఉండగా రెండు, మూడు పర్యాయాలు పంపారు. వైసిపి అధికారంలోకి వచ్చిన రెండుసార్లు నివేదించారు. అయినా ఒక్క అడుగూ ముందుకు పడలేదు. దీంతో కాలువ గట్లు బలహీనంగా మారాయి. కొన్నిచోట్ల కాలువ గట్లకు గండి పడ్డాయి. దీంతో బ్యారేజీలో నీళ్లున్నా పూర్తిస్థాయిలో నీరు విడిచిపెట్టలేని పరిస్థితి తలెత్తుతోంది. ఈ పరిస్థితిని అధిగమించాలంటే కాలువల ఆధునికీకరణ ఒక్కటే మార్గమని అధికారులు చెప్తున్నారు. కొత్త ప్రభుత్వమైనా చొరవ తీసుకుంటే రైతులకు సాగునీటి ఇబ్బందులు తీరనున్నాయి.

- **తొమ్మిదేళ్లుగా పెండింగ్‌లో ప్రతిపాదనలు**
- **రూ.450 కోట్ల నుంచి రూ.950 కోట్లకు పెరిగిన అంచనా వ్యయం**
- **వంశధార మోడర్‌నైజేషన్‌తోనే శివారుకు సాగునీరు**
- **కొత్త ప్రభుత్వం దృష్టిసారిస్తే తీరనున్న సాగునీటి కష్టాలు**

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార ప్రాజెక్టును హిరమండలం వద్ద 1970లో స్టేజ్-1 కింద గొట్టాబ్యారేజీ నిర్మాణంతో పాటు కుడి, ఎడమ కాలువలను నిర్మించారు. కాలువల్లోకి 1977 నుంచి నీటిని విడిచిపెట్టడం మొదలుపెట్టారు. అప్పట్నుంచి కాలువలు ఆధునికీకరణకు నోచుకోలేదు. కాలువ నుంచి 12 మండలాల పరిధిలోని 1,48,000 ఎకరాలకు సాగునీరందించేలా కాలువను నిర్మించారు. కాలువ నుంచి 2,480 క్యూసెక్కుల నీరు విడిచిపెట్టేలా కాలువను డిజైన్ చేశారు. బ్యారేజీలో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్న రోజుల్లోనూ 1800 క్యూసెక్కులకు మించి విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది. కాలువల నిర్వహణ లేకపోవడం, గట్లు బలహీనంగా ఉండడంలో అంతకుమించి నీటిని వదిలితే గండి కొట్టే ప్రమాదమూ లేకపోలేదు. కాలువ వాస్తవ సామర్థ్యం మేరకు నీటిని విడిచిపెట్టలేకపోవడంతో ప్రతి సంవత్సరం పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని వేలాది ఎకరాల భూములు ఎండిపోతున్నాయి. తుపాన్లు, నీటి ప్రవాహ ఉధృతికి క్రమేణా కాలువ గట్టు కోతకు గురవుతున్నాయి. 40 ఏళ్ల కిందట రాతితో నిర్మించిన నిర్మాణాలు ప్రస్తుతం దెబ్బతినడంతో, ఎడమ కాలువ సామర్థ్యం అంతకంతకూ తగ్గిపోతోంది.

అంతకంతకూ పెరుగుతున్న అంచనా వ్యయం

ఎడమ కాలువను ఆధునీరించాల్సిన అవసర ముందంటూ గత తొమ్మిదేళ్లుగా అధికారులు ప్రతిపాదనలు పంపుతూనే ఉన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చి తర్వాత మొదటిసారి 2016లో రూ.456 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ఆ తర్వాత చివరిసారిగా 2018లో రూ.624 కోట్లతో పంపారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత 2019లో మొదటిసారి పంపారు. 2021 మార్చిలో రూ.776 కోట్లతో, 2023 నవంబరులో రూ.954 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం అంచనా వ్యయం మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

హిరమండలం సమీపంలో ఎడమ కాలువపై నుంచి ప్రవహిస్తున్న నీరు (ఫైల్)

కుడి ప్రధాన కాలువదీ అదే దుస్థితి

గొట్టాబ్యారేజీ కుడి కాలువ ప్రధాన కాలువదీ అదే దుస్థితి. కాలువ గట్లు కోతకు గురయ్యే ప్రాంతంలో సిసి లైనింగ్ పనుల కోసం 2021-22లో రూ.18.45 కోట్లతో అంచనాలు రూపొందించి పరిపాలనా ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపారు. ఆ తర్వాత 2022-23లో రూ.22 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఆమోదం లభించలేదు.

రెండు పర్యాయాలు కోతకు గురైన గట్లు

వంశధార కాలువలు, గొట్టాబ్యారేజీ ప్రాంతం ఎంత బలహీనమో రెండు సందర్భాల్లో చోటుచేసుకున్న ఘటనలే అందుకు ఉదాహరణ. 2023 అక్టోబరులో వంశధారలో 80వేల క్యూసెక్కు వరద నీరు ప్రవహిస్తున్న సందర్భంలో బ్యారేజీ దిగువ కుడివైపులా గట్టు కోతకు గురైంది. గట్టును రూ.13.5 లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు.

అదేవిధంగా హిరమండలం అక్కరాపల్లి 2022 జూలైలో అండర్ టన్నల్ వద్ద కాలువకు గండి పడింది. దాన్నీ రూ.ఐదు లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టి కాలువలకు నీరు విడిచిపెడుతున్నారు. వంశధార ఉధృతంగా ప్రవహిస్తే కాలువలు, గొట్టాబ్యారేజీ గట్లు ఎప్పుడు ఏవి కొట్టుకుపోతాయో అన్న పరిస్థితి నెలకొంది. కొత్త ప్రభుత్వమైనా కాలువల ఆధునికీకరణ నిధులు కేటాయిస్తే, రైతులకు సాగు సమస్యలు తీరుతాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

వేట సాగక... పూట గడవక

- భావనపాడు హార్బర్ వద్ద భారీగా ఇసుక మేటలు
- బోట్లు కదలక మత్స్యకారుల ఇక్కట్లు

భావనపాడు హార్బర్ ముఖద్వారం వద్ద భారీస్థాయిలో ఏర్పడిన ఇసుక మేటలు

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాలి మండలంలోని భావనపాడు తీరం మత్స్య సంపదకు నెలవైన ప్రాంతం. భావనపాడుతో పాటు చుట్టుపక్కల మత్స్యకార గ్రామాలైన దేవునల్తాడా, గద్దలపాడు, కంబాలరాయుడుపేట, మంచినీళ్లపేట తదితర గ్రామాల నుంచి మత్స్యకారులు ఇక్కడ నుంచే వేట సాగిస్తారు. ఇక్కడి హార్బర్ వద్ద బోట్లు నిలుపుటకు అనువైన స్థలం ఉండడంతో బోట్లు లంగర్ వేసి భద్రపరుస్తారు. ఇక్కడి నుంచే సముద్ర లోపలికి వేటకు వెళ్లి చేపలు వేటాడు తీసుకొస్తారు. గత కొన్ని దశాబ్దాలుగా తాతతండ్రుల నుంచి వేటపైనే ఆధారపడే మత్స్యకార కుటుంబాలకు ఫిషింగ్ హార్బర్ ఒక ప్రధాన ఆదాయవనరు. ప్రస్తుతం భావనపాడు హార్బర్‌కు సమీప రెండు కిలోమీటర్ల దూరంలోనే మూలపేట పోర్టు నిర్మిస్తున్నారు. దీంతో దీంతో మత్స్యకారులకు అనుకోని కష్టం వచ్చి పడింది. మూలపేట పోర్టులో ప్రధాన నిర్మాణమైన బ్రేక్ వాటర్ పనులు జరుగుతున్నాయి. ఈ నిర్మాణంలో రాళ్ల మధ్య నింపే ఇసుక సముద్రపు ఆటుపోట్లతో భావనపాడు హార్బర్ ముఖద్వారం వద్దకు వచ్చి మేటలు వేస్తుంది. కొద్దికొద్దిగా మొదలైన ఇసుక మేటలు భారీ స్థాయిలో ఏర్పడడంతో సముద్రంలో కలిసే ఉప్పుటేరు ముఖద్వారం వద్ద నీటిమట్టం కంటే పైకి ఇసుక దిబ్బలు పేరుకుపోయాయి. దీంతో హార్బర్ నుంచి నేరుగా సముద్రంలోకి బోట్లు వెళ్లేందుకు ఆటంకం ఏర్పడుతుంది.

బోట్లు కదలక మత్స్యకారుల ఇక్కట్లు

భావనపాడు పోర్టు నిర్మాణ పనులు ప్రారంభమై ఏడాదిన్నర కావస్తోంది. దీనిలో వాడే ఇసుక క్రమక్రమంగా భావనపాడు హార్బర్లోకి చేరి మేటలుగా ఏర్పడింది. మత్స్యకారులకు ఏటా చేపల సంతానోత్పత్తి కారణంగా ప్రభుత్వం ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు సముద్రంలో వేటను నిషేధిస్తుంది. ఇక అప్పటి నుంచి భావనపాడు మత్స్యకారులకు వేట కష్టాలు మొదలయ్యాయి. ఈ రెండు నెలలు నిషేధ కాలంలో చేపలు వేటలేక, ప్రభుత్వ సహాయం లేక ఇబ్బందులు పడుతున్న మత్స్యకారులకు నిషేధ కాలం తర్వాత ఇసుక మేటలు ఇక్కట్లకు గురిచేస్తున్నాయి. సుమారు వందకు పైగా బోట్లు, బోట్లపై ఆధారపడిన వందలాది మంది మత్స్యకారులు భావనపాడు హార్బర్ నుంచి ఇసుక మేటర్ దాటి సముద్రంలోకి వెళ్లేందుకు మార్గం లేక, వేట చేసేందుకు వీలు లేక ఎక్కడి ఓట్లు అక్కడే కట్టిపడేశారు. గత నాలుగైదు దశాబ్దాలుగా ఎప్పుడూ లేని కష్టాలను గత నాలుగు నెలలుగా ఈ ప్రాంత మత్స్యకారులు అనుభవిస్తున్నారు. అక్కడక్కడ పెద్దబోట్లతో ప్రాణాలకు తెగిచి ఇసుక మ్యాటలు దాటి వెళ్లాలని ప్రయత్నించినా... ఇసుక మేటలకు తగిలిన బోట్లు తీవ్రస్థాయిలో దెబ్బతింటున్నాయి. కొన్నిసార్లు ప్రమాదం జరిగి బోట్లు తిరగబడుతున్నాయి. తెగించి ప్రాణాలు పైకి తెచ్చుకోవడం ఎందుకని మత్స్యకారులు వెనకడుగు వేస్తున్నారు. ఆదాయం లేక ప్రత్యామ్నాయం కోసం వలసలు పోతున్నారు.

డ్రెజల్లింగ్ చేసి శాశ్వత పరిష్కారం చూపాలి

గతంలో ఎప్పుడూ రాని ఇసుక మేటలు మూలపేట పోర్టు నిర్మాణం వల్లే ఏర్పడుతున్నాయని గ్రహించిన మత్స్యకారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీర ప్రాంతం అభివృద్ధికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు తమకు పొట్ట కొడుతున్నాయని పలువురు వాపోతున్నారు. వారసత్వంగా వస్తున్న వేటను చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే హార్బర్ వద్ద ఏర్పడిన భారీ ఇసుక మేటలను యంత్రాలతో డ్రెజ్లింగ్ చేసి తొలగించాలని కోరుతున్నారు. అంతేకాకుండా భవిష్యత్‌లో మళ్లీ ఇసుక మేటలు ఏర్పడకుండా రక్షణ వలయం నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఇదే నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తుండడంతో మత్స్యకారులు మంత్రిపైనే గంపెడాశలు పెట్టుకున్నారు. డ్రెజ్లింగ్ చేసి తొలగించాలని కోరుతూ పలుమార్లు వినతిపత్రం అందజేశారు. కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు, మత్స్యశాఖ అధికారులకు తన సమస్యను పరిష్కరించాలని కలిసి వినతి పత్రాలు అందజేశారు. డ్రెజ్లింగ్ పనులకు సుమారు రూ.70 లక్షల పైగానే ఖర్చవుతుందని అంచనాతో ప్రభుత్వం చొరవ చూపడం లేదని సమాచారం. ఈ నేపథ్యంలో తమ కష్టాలను అర్థం చేసుకొని తగిన నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించాలని గ్రామస్తులు, మత్స్యకారులు, మత్స్యకార నాయకులు కోరుతున్నారు.

నాలుగు నెలలుగా ఆర్థిక ఇబ్బందులు

దశాబ్దాలుగా ఇదే ప్రాంతం నుంచి వేట సాగిస్తున్న మత్స్యకారులు ఇసుక మేటలతో ఇటువంటి ఇబ్బంది ఎప్పుడూ రాలేదు. ఎన్నో తుపాన్లు, విపత్కర పరిస్థితులు ఎదుర్కొన్నా ఈ విధంగా వేటసాగించేందుకు ఆటంకం ఏర్పడలేదు. వేట నిషేధ కాలం రెండు నెలల పాటు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం తక్షణమే చొరవ చూపాలి.

– గొరకల ఆదినారాయణ, మత్స్యకార సొసైటీ ప్రెసిడెంట్, భావనపాడు

శాశ్వత పరిష్కారం చూపాలి

ప్రధాన జీవనాధారం కోల్పోయిన మత్స్యకారులు నాలుగు నెలలుగా వేట లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయ మార్గాల కోసం వలసలు పోతున్నారు. మా గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామం మత్స్యకారులకు ఎప్పుడు లేని సంక్షోభం ఏర్పడింది. ప్రభుత్వం వెంటనే డ్రెజ్లింగ్ పనులు చేపట్టాలి. భవిష్యత్‌లో ఇసుక మేటలు వేయకుండా రక్షణ వలయం ఏర్పాటు చేయాలి.

– బి.తులసీదాసు, మత్స్యకారుడు, భావనపాడు

వంతెన ఒడ్డుకు చేరేనా?

అర్థాంతరంగా నిలిచిన వంతెన నిర్మాణ పనులు

ఏడేళ్లు గడుస్తున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే...

ప్రజాశక్తి- పోలాకి

రాష్ట్రంలోనే శ్రీకాకుళం జిల్లాకి ఒక ప్రత్యేకత ఉంది. జిల్లాలో ముఖ్యమైన ఆలయాల్లో జలుమూరు మండలం శ్రీముఖలింగంలోని శ్రీముఖలింగేశ్వరం, గార మండలం శ్రీకూర్మరంలో కూర్మావతారంమిక్కిలి ప్రసిద్ధి చెందినవి. అయితే ఈ ఆలయాల మధ్య ఉన్న పోలాకి మండలంలోని దీర్ఘాశి, పాండవులుకొండ, జగతి మెట్టు, వనిత మండలం, తలసముద్రంలో ఉన్న వేనుగోపాలస్వామి ఆలయం కలుపుతూ గార మండలంలోని సాలిహుండం క్షేత్రాన్ని కలిపి బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అటు కళింగపట్నం, ఇటు శ్రీకూర్మం వెళ్లేవిధంగా పర్యాటక ప్రదేశాలుగా గుర్తించేందుకు అప్పటి టిడిపి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లారు. అందులో భాగంగా 2018లో పోలాకి మండలంలో వనిత మండలం, గార మండలంలోని గార గ్రామాల మధ్య వంశధార నదిపై వంతెన నిర్మాణానికి రూ.72 కోట్లు మంజూరు చేశారు. పనులు కూడా కొంత వరకు చేపట్టారు. 2019లో జరిగిన ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం వచ్చింది. నరసన్నపేట ఎమ్మెల్యేగా ధర్మాన కృష్ణదాస్ గెలుపొందారు. ఏదేమైనా పనులు పూర్తవుతాయని రెండు మండలాల ప్రజలు ఆశ పడ్డారు. కానీ, ఆ అయిదేళ్లు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా తయారైంది. వైసిపి ప్రభుత్వం ఎన్నికల ముందు కొంత ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకపోయింది.

నిర్మాణం పూర్తయితే ఉపయోగాలు

ఈ వంతెన పూర్తయితే పోలాకి, నరసన్నపేట, సారవకోట, జలుమూరు, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, టెక్కలిలో కొంత ప్రాంతాలకి చెందిన వారు, గార మండలంలోని సాలిహుండం, శ్రీకూర్మం, కళింగపట్నం చేరేందుకు 50 కిలోమీటర్ల వ్యయ ప్రయాసాలు తగ్గుతాయి. గార నుంచి పోలాకి రావాలన్నా... పోలాకి నుంచి గార వెళ్లాలన్నా చుట్టూ తిరిగి వెళ్లాల్సిందే. దీంతో సమయం, డబ్బులు వృథా అవుతుంది. అంతే కాకుండా ఈ వంతెన నిర్మిస్తే సరుకులు రవాణా కూడా సులభరం అవుతుంది. సంతబొమ్మాళి మండలంలో మూలపేట వద్ద పోర్టు నిర్మాణం అవుతుంది. కనుక రాకపోకలు పెరుగుతాయి కనుక ఎంతో అవసరమని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు ఈ వంతెన నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించి పనులు పూర్తి చేయాలని పలువురు కోరుచున్నారు.

సగంలో నిలిచిన వంతెన పిల్లర్ల పనులు

తుప్పు పట్టిన వంతెన నిర్మాణ సామగ్రి

పనుల ప్రారంభానికి చర్యలు

ఈ వంతెన నిర్మాణం ప్రాధాన్యత గుర్తించి అప్పటి సిఎం చంద్రబాబు నిధులు మంజూరు చేశారు. వైసిపి ప్రభుత్వ హయాంలో వంతెన పనులు నిలిచిపోయాయి. మళ్లీ అధికారంలో వచ్చాం. సిఎం దృష్టికి తీసుకెళ్లి ఈ వంతెన నిర్మాణానికి కృషి చేస్తా. డోల నుంచి నౌపడ వరకు రోడ్ విస్తరణ పనులపైనా దృష్టిసారించాం. త్వరలో పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపడతాం.

- బగ్గు రమణమూర్తి, ఎమ్మెల్యే, నరసన్నపేట

'వైసిపితోనే మహిళా అభివృద్ధి'

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

జోగి రాములమ్మ

వైసిపి ప్రభుత్వంతోనే మహిళలు అభివృద్ధి చెందారని సంతబొమ్మాళి వైసిపి మహిళా అధ్యక్షులు జోగి రాములమ్మ అన్నారు. ఈ సందర్భంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సంతబొమ్మాళిలో ఎన్నడూ లేని విధముగా అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఎపిలో దిశ పోలీస్‌స్టేషన్లను ఏర్పాటు చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. చట్టసభల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించి రాజకీయ ప్రాధాన్యత కల్పించారని అన్నారు. 45 నుంచి 60 ఏళ్లలోపు మహిళల కోసం ఏడాదికి రూ.18,750 చేయూత పథకం ద్వారా అందించామని అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సచివాలయాలు ఏర్పాటు చేసి ఒక్క మహిళా పోలీస్‌ను నియమించారని అన్నారు. దిశ యాప్ ద్వారా మహిళలకు రక్షణ కల్పించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు.



రైతుసేవా కేంద్రాల్లో ఎరువులు అందించాలి

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

రైతులకు రైతు సేవా కేంద్రాలు, పిఎసిఎస్‌ల ద్వారా రైతులకు సబ్సిడీపైన ఎరువులు అందించాలని పిఎసిఎస్ మాజీ చైర్మన్ కెల్లి జగన్నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.

కెల్లి జగన్నాయకులు

ఈ మేరకు 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. గత ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాలు, సొసైటీల ద్వారా యూరియా, డిఎపి, పొటాష్ అందించారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో రైతులకు యూరియా, డిఎపి, పొటాష్ దొరకపోవడంతో రైతులు దళారులు వద్ద అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. దగ్గర రైతులు అధిక ధరలు ఇచ్చి కొనుగోలు చేస్తున్నారరని అన్నారు. రైతు సేవా కేంద్రాలుల్లో మొదటి విడతలో అరకొరకగా ఎరువులు ప్రభుత్వం అందించడంతో దళారులు కృత్రిమ ఎరువులు కొరత సృష్టిస్తున్నారని అన్నారు. కొన్ని రైతు సేవా కేంద్రాలకు ఒక ఎరువు ఇస్తే... మరొక ఎరువు ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి రైతులకు యూరియా, డిఎపి, పొటాష్ రైత్ సేవా కేంద్రాల ద్వారా, సొసైటీల ద్వారా అందించాలని కోరారు.



ఐటిడిఎ ఏర్పాటుకు జాప్యమెందుకో?

- జిల్లాల విభజనతో నష్టపోయిన గిరిజనులు
- ఏర్పాట్లపై కనీస కదలిక లేని వైనం
- సమస్యలు పరిష్కారం కాక ఆదివాసీల ఇబ్బందులు
- మెళియాపుట్టిలో ఏర్పాటు చేయాలని డిమాండ్

టెక్కలి డివిజన్‌లో ఆదివాసీలు గ్రామాలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో టెక్కలి డివిజన్ పరిధిలోని మెళియాపుట్టిలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలని గిరిజనులు, ఆదివాసీ గిరిజన సంఘ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లాల విభజన తర్వాత శ్రీకాకుళానికి సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటిడిఎ) లేకుండా పోయింది. ఆదివాసీలకు ఉమ్మడి జిల్లాలో ఉన్న సీతంపేట ఐటిడిఎ పార్వతీపురం మన్యం జిల్లాకు తరలిపోయింది. సీతంపేట ఐటిడిఎ ఎప్పటిమాదిరిగానే తన పరిధిలోని మండలాలకు సేవలందిస్తుం దని ప్రభుత్వం చెప్పినా, జిల్లాలోని ఐటిడిఎ పరిధిలోని సబ్‌ప్లాన్ మండలాలు, గిరిజన ప్రభావిత మండలాల ఆదివాసీలను పట్టించుకునే వారే కరువయ్యారు. జిల్లాకు కొత్తగా ఐటిడిఎ ఏర్పాటు చేయాలని గిరిజనులు పలురూపాల్లో ఆందోళనలు, పోరాటాలు, ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వాలు, పాలకులు పట్టించుకోక పోవడం గమనార్హం.

మెళియాపుట్టి మండల కేంద్రం

ప్రజాశక్తి- టెక్కలి

జిల్లా విభజన నేపథ్యంలో సీతంపేట ఐటిడిఎ పార్వతీపురం మన్యం జిల్లాకు తరలిపోయింది. అయితే జిల్లాల విభజన జరిగి రెండున్నర సంవత్సరాలు కావస్తున్నప్పటికీ నేటి వరకు జిల్లాలో ఐటిడిఎ లేకపోవడం విశేషం. మెళియాపుట్టి కేంద్రంగా ఐటిడిఎ ఏర్పాటు చేయాలని ఆదివాసీ వికాస్ పరిషత్, గిరిజన సంఘాలు కోరుతున్నారు. అయినా పాలకులు హామీలు ఇచ్చారే తప్ప ఏర్పాటుపై విముఖత వ్యక్తం చేయడంపై గిరిజనులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెళియాపుట్టిలో ఐటిడిఎ ఏర్పాటుపై నాటి వైసిపి ప్రభుత్వం హామీ నిచ్చింది. కానీ, ఆచరణకు నోచుకోలేదు. ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల ప్రచారంలో భాగంగా పలాస, పాతపట్నం బహిరంగ సభల్లో మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెళియాపుట్టిలో ఐటిడిఎ ఏర్పాటు చేస్తామని హామీ నిచ్చారు. అధికారంలోకి వచ్చి రెండున్నర నెలలు అవుతున్నా... ఇప్పటి వరకు దాని ప్రస్తావన లేకపోవడం గమనార్హం.

ఐటిడిఎ ఉంటే ప్రత్యే నిధులు మంజూరు

ఐటిడిఎ ఉంటే గిరిజన గ్రామాలాభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు మంజూరవుతాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధుల ద్వారా గిరిజన సంక్షేమం, అభివృద్ధి చెందుతాయి. వీటితో పాటు ట్రైకార్, ఎన్‌ఎఫ్‌డిసి వంటి వాటి ద్వారా నిధులు మంజూరయితే సబ్సిడీ ద్వారా విత్తనాలు, గిరిజనులకు అవసరమైన పనిముట్లు వంటివి అందుబాటులో ఉంటాయి. ఆదివాసీ, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకునే క్రమంలో భాగంగా వాటికి శిక్షణ ఇచ్చేందుకు కేంద్రాలు ఏర్పాటు చేసి ఆయా కళల్లో నిష్ణాతులుగా ఉన్న వారిని ఎంపిక చేసి వారి ద్వారా గిరిజనులకు శిక్షణ ఇచ్చేవారు. తద్వారా వారి సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకునే వారు. కానీ, ఐటిడిఎ లేకపోవడంతో వాటన్నింటికీ దూరమవుతున్నారు. ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లాలో రెండు ఐటిడిఎలు ఉన్నాయి. కానీ, విభజిత శ్రీకాకుళం జిల్లాలో ఒక్క ఐటిడిఎ కూడా లేకపోవడం విచారకరం. విభజిత జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యాన కలెక్టరేట్ ముందు 72 గంటలు నిరాహార దీక్ష ఏడాది క్రితం చేపట్టారు. కానీ, ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడం గమనార్హం. అదేవిధంగా గత ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, రెవెన్యూశాఖ మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, వంటి వారికి వినతిపత్రాలందించారు. వీరితో పాటు జిల్లాస్థాయి అధికారులకు, ఉన్నతస్థాయి అధికారులకు వినతిపత్రాలు అందించారు. అయినా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో గిరిజనులు, సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

గర్భిణిని నడిపించుకుని తీసుకెళ్తున్న ఆశా కార్యకర్త (ఫైల్)

ఆదివాసీ దినోత్సవాలు కరువు

ఇదిలాఉండగా ఇటీవల జరిగిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ నిర్వహణ కూడా ప్రభుత్వం జరిపించలేకపోయింది. వైసిపి ప్రభుత్వ హయాంలో కీర్తిశేషులు రాజశేఖర్‌రెడ్డి, వర్ధంతిని, టిడిపి ప్రభుత్వం లో కేంద్ర మాజీ మంత్రి కీర్తిశేషులు కింజరాపు ఎర్రంనాయుడు వర్ధంతి కార్యక్ర మాలుగా నిర్వహించే పాలకులు... ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని కనీసం పట్టించు కోకపోవడంపై గిరిజనులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వాలు హామీనిచ్చి నప్పటికీ జిల్లాలో ఐటిడిఎ ఎందుకు ఏర్పాటు చేయడం లేదన్న ప్రశ్నకు సమాధానం లేకపోవడం గమనార్హం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జిల్లాలో ఐటిడిఎని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఐటిడిఎ ఎందుకు?

విభజిత జిల్లాలో ఐటిడిఎ ఎందుకు అవసరం అంటే మెళియాపుట్టి, మందస, పాతపట్నం, కొత్తూరు, హిరమండలం, సారవకోట, బూర్జ, నందిగాం, కంచిలి, పలాస, టెక్కలి, ఎల్‌ఎన్‌పేట తదితర మండలాల్లో సుమారు 15 వందల గిరిజన గ్రామాలు ఉన్నాయి. గ్రామాల అభివృద్ధికి ఐటిడిఎ ఆవశ్యకత ఎంతైనా అవసరం. ఎందుకంటే గ్రామాలభివృద్ధి, రోడ్ల నిర్మాణం, గిరిజన విద్యార్థుల చదువులు, గిరిజన ఉత్పత్తులకు గిట్టుబాటు ధర, గిరిజన సంప్రదాయాలు పరిరక్షణ వంటి అనే అభివృద్ధి పనులకు ఐటిడిఎ అవసరం. అయితే గడచిన రెండున్నరేళ్లుగా లేకపోవడంతో అభివృద్ధి నిలిచిపోయిందనే చెప్పవచ్చు. ఉమ్మడి ఐటిడిఎ పరిదిలో సుమారు 47 గిరిజన ఆశ్రమ పాఠశాలలు, 16 పోస్టుమెట్రిక్ వసతిగృహాలు, వందకు పైగా జిపిఎస్ పాఠశాలలు, మెళియాపుట్టి ఏకలవ్య పాఠశాల ఉన్నాయి. వీటి నిర్వహణ ఆంతా ఐటిడిఎ పరిధిలోనే ఉంది. గిరిజన విద్యార్థులు చదువుకోవడానికి పుస్తకాలు కావాలన్నా, స్టడీ మెటీరియల్, మేనేజ్‌మెంట్, నిరుద్యోగులకు ఉపాధి, జిపిఎస్ పాఠశాలలు ఏర్పాటు, వాటిలో విద్యా వాలంటీర్ల నియామకం వంటి ప్రతి చిన్న పనికీ ఐటిడిఎ అవసరం. ప్రస్తుతం అది లేకపోవడంతో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. గిరిజన విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం లేకపోవడంతో వారు ఖాళీగా ఉంటున్నారు.

పాలకులకు చిత్తశుద్ధి లేదు

ఉమ్మడి జిల్లాలో సీతంపేటలో ఐటిడిఎ ఎన్నప్పుడు... మెళియా పుట్టిలో మినీ ఐటిడిఎ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశాం. కానీ, పాలకులు స్పందిం చలేదు. జిల్లా విభజన జరిగిన తర్వాత ఐటిడిఎ కనుమరుగు కావడంతో మెళియాపుట్టిలో ఏర్పాటు చేయాలని కోరాం. చాలా మందికి నాయకులకు వినతిపత్రాలు అందించాం. పోరాటాలు, ఆందోళనలు చేశాం. పాలకులు హామీనిచ్చారే కానీ, ఏర్పాటు చేయలేదు. అందుకే ఇటీవల జరిగిన ఎన్నికల్లో జిల్లా స్వతంత్ర ఎంపీగా పోటీ చేశాను. కానీ, పాలకులకు కనువిప్పు కలగలేదు. కొద్ది రోజులు వేచి చూసిన తర్వాత మరలా ప్రణాళికాపరంగా పోరాటం చేస్తాం. ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తాం. త్వరలో కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజ రాపు రామ్మోహన్ నాయుడును కలుస్తాం.

- వాబ యోగి, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర నాయకులు

కలెక్టరేట్ వద్ద దీక్ష చేస్తున్న ఆదివాసీ సంక్షేమ సంఘం నాయకులు (ఫైల్)

ఐటిడిఎ కావాలని కోరుతూ
కేంద్రమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న యోగి (ఫైల్)

కొబ్బరి చీపుర్లతో స్వయం ఉపాధి

సంతబొమ్మాళి : కొబ్బరి చీపుర్లతో మహిళలకు స్వయం ఉపాధినిస్తోంది. పుట్టింటిలో ఉపాధి ఇవ్వని వస్తువు వారికి అత్తింట్లో ఉపాధినిస్తోంది. ఇంట్లో సమయం సద్వినియోగం చేసుకుంటూ కొబ్బరి చీపుర్లు తయారీతో స్వయం ఉపాధి పొందుతున్నారు. మండలంలోని తీర ప్రాంతానికి చెందిన పలువురు మహిళలకు కొబ్బరి చెట్ల ఉపయోగం అనేకం. కొబ్బరి కొమ్మలతో మహిళలు చీపుర్లను తయారు చేస్తున్నారు. తీర ప్రాంత గ్రామాల్లో సుమారు వందకు పైగా కుటుంబాలు ఈ దిశగా అడుగులేస్తూ ప్రగతి పథంలో ముందుకు పయనిస్తున్నారు. మండలంలోని మేఘవరం పంచాయతీ సూరాడవానిపేట, మరువాడ పంచాయతీలో చొక్కరవానిపేట, గుడ్డిమీదపేట, మలగాం పంచాయతీలో కారిపేట, సూరాడ వానితోట, దేపల్లివానిపేట, కుముందవానిపేట, మలగాం, లక్కివలస పంచాయతీ గెద్దలపాడు, పిట్టవానిపేట తీర గ్రామాలకు చెందిన మహిళలు ఇంటి వద్దనే ఉంటూ కొబ్బరి చీపుర్లు తయారు చేస్తున్నారు. మహిళలు తమ భర్తలు తెచ్చే చేపలను అమ్ముకుంటూ వచ్చిన ఆదాయం కొద్ది మొత్తంతో కుటుంబ పోషణ భారంగా ఉందని గుర్తించారు. దీంతో పలువురు మహిళలు కూలి పనులు, ఉపాధి పనులు, చేపలు అమ్ముకుంటూనే మిగిలిన ఖాళీ సమయాన్ని వృథా చేయకుండా కొబ్బరి చీపుర్లు తయారు చేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా నిలుస్తున్నారు. తీర ప్రాంతాల్లో కొబ్బరి తోటల విస్తీర్ణం ఎక్కువగా ఉంది. దీంతో తోట యజమానులతో మాట్లాడి కొబ్బరి మట్టను ముడిసరుకుగా తక్కువ మొత్తంలో కొనుగోలు చేస్తుంటారు. ఇలా రోజుకు 5 కిలోల నుంచి 15 కిలోల వరకు కడతారు. ఇలా కట్టిన చీపుర్లను మహిళలు టెక్కలి, నరసన్నపేట, పలాస, శ్రీకాకుళం ప్రాంతాలకు వివిధ వాహనాల్లో వెళ్లి దుకాణాలకు అమ్మకాలు చేస్తున్నారు. కొబ్బరి చీపురు కట్ట రూ.10 నుంచి రూ.20 వరకు అమ్ముతుంటారు. రాజమహేంద్రవరం, విశాఖపట్నం, అమలపురం, ఒడిశా రాష్ట్రం తదితర ప్రాంతాల నుంచి నుంచే వివిధ వ్యాపారులు కొబ్బరి చీపురులను ఇక్కడి నుంచే ఎగుమతి చేస్తున్నారు. ఇలా ఖర్చులన్నీ పోనూ రోజుకు రూ.200 వరకు మిగులుతోందని మహిళలు పేర్కొంటున్నారు.

చీపుర్లు తయారు చేస్తున్న మహిళ

రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలి

పదేళ్ల క్రితం కొబ్బరి చీపుర్ల తయారీని ప్రారంభించాం. ఇంటి వద్ద తయారు చేసి వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేసి అమ్మకాలు చేపడుతున్నాం. ఖర్చులు పోనూ రోజుకు రూ.200 వరకు మిగులుతోంది. తక్కువ ఖర్చుతో ఉత్పత్తులు తయారు చేసి అమ్మడం ద్వారా కుటుంబానికి ఆర్థిక భరోసా లభించింది. ప్రభుత్వం స్వయం ఉపాధి రుణాలందించి సహకారం అందిస్తే మరింత మందికి ఉపాధి కల్పిస్తాం. ఆ దిశగా మమ్మల్ని ప్రోత్సహించాలి.

- మైలపిల్లి పరదేశమ్మ, సూరాడవానిపేట

వనరులున్నా... వినియోగం సున్నా

- పర్యాటక అభివృద్ధికి నోచుకోని టెక్కలి
- హామీలకే పరిమితం

డివిజన్, నియోజకవర్గ కేంద్రమైన టెక్కలి పర్యాటక కేంద్రంగా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. పట్టణాన్ని, కేంద్రాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్న హామీలే తప్ప ఆచరణలో ఎక్కడా కానరావడం లేదు. దశాబ్ధాల కాలం నుంచి పర్యాటకం అభివృద్ధి చర్చ, హామీలు జరుగుతున్నా నేటి వరకు ఆచరణలో లేకపోవడం గమనార్హం. పర్యాటక రంగంగా అభివృద్ధి చేసేందుకు కావల్సిన వనరులు ఉన్నా... వాటిని వినియోగించుకుని అభివృద్ధి జాడలను ముందుకు నడిపించడంలో పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కీర్తిశేషులు కింజరాపు ఎర్రంనాయుడు, హనుమంతు అప్పయ్యదొరల కాలం నుంచి టెక్కలి పర్యాటకం అభివృద్ధి హామీలు ఇచ్చారు. ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం పిపిఎ పద్ధతి ద్వారా అభివృద్ధి చేస్తామని చెబుతున్నా... ఆచరణలో ఎలా ఉంటుందో వేచిచూడాలి.

టెక్కలి పట్టుమహదేవి కోనేరు

టెక్కలి పట్టణ వ్యూ

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి పట్టణ నడిబోడ్డున ఉన్న పట్టుమహదేవి కోనేరుగట్టుని విస్తరించాలి, గట్టుపై రిస్టార్స్ వంటి ఏర్పాటు చేస్తూనే చెరువులో బోట్‌షికార్ వంటి వాటిని అభివృద్ధి చేయాలి, అలాగే చెరువు మధ్యలో విగ్రహాలు, ర్యాంప్ వంటిది ఏర్పాటు చేయాలనే ఆలోచన హనుమంతు అప్పయ్యదొర మదిలో పుట్టిన ఆలోచనకు ఆంకురార్పన జరగలేదు. అప్పటి సబ్ కలెక్టర్ మల్లిఖార్జున ముధావత్ నాయక్ కూడా అప్పయ్యదొర ప్రతిపాదనలపై దృష్టిసారించారు. చెరువునీ పరిశీలించారు. కానీ, కార్యరూపం దాల్చలేదు. తర్వాత కేంద్ర సహాయ మంత్రిగా ఉన్న డాక్టర్ కిల్లి కృపారాణి కూడా దృష్టి సారించినప్పటికీ ఆచరణలోకి రాలేదు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అప్పట్లోను, ఇప్పట్లోను మంత్రిగా ఉన్నా.. పట్టుమహదేవి కోనేరు అభివృద్ధిపై కనీసం స్పందించకపోవడం గమనార్హం. గడచిన వైసిపి ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ పట్టుమహదేవి కోనేరు అభివృద్ధిపై ప్రణాళిక రూపొందించి ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. అయినా ఫలతం లేకపోవడం గమనార్హం. పట్టుమహదేవి కోనేరు అభివృద్ధి జరగలేదు సరికదా... ఉన్న చెరువుని కూడా నాశనం చేశారని ప్రజలు వాపోవడం విశేషం.

మదనగోపాలసాగరం...

టెక్కలి పంచాయతీ పరిధి లచ్చున్నపేట వద్ద గల జాతీయ రహదారి పక్కనే మదనగోపాలసాగరం ఉంది. విశాలమైన ఈ సాగరం గట్టుని కూడా విస్తరించి ఈ ప్రాంతంలో రిస్టార్స్ వంటివి ఏర్పాటు చేయవచ్చు. జాతీయ రహదారికి ఆనుకుని ఉండడం టెక్కలి పట్టణానికి కూతవేటు దూరంలోనే మదనగోపాలసాగరం ఉండడంతో పర్యాటకంగా అభివృద్ధి చేయవచ్చునని ఎర్రంనాయుడు ఆలోచన చేశారు. అదేవిధంగా సాగరంలో ఉన్న వంశధార నీటి నిల్వలతో అందమైన వాతావరణాన్ని తయారు చేయించి లైటింగ్ వంటివి ఏర్పాటు చేస్తే బాగుంటుందనే భావించారు. సాగరం గట్టుపై నుంచి పరిశీలిస్తే అందమైన ప్రకృతితో పాటు గ్రానైట్స్ కొండలు చూపరులకు ఆకట్టుకునే విధంగా ఉంటుంది. ఇందుకు అనుగుణంగా వంశధార అధికారులు, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి సాగరాన్ని అప్పట్లో పరిశీలించారు. పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళిక రూపొందించారు. అప్పట్లో మదనగోపాలసాగరం అభివృద్ధి చెందుతుందని ఆశించిన టెక్కలి ప్రజానీకానికి పర్యాటకం ఆశగానే మిగిలిపోయింది. ఇప్పటికీ మదనగోపాలసాగరం గట్టు, గర్భం వృథాగానే మిగిలిపోయింది.

రావివలస...

మండలంలోని రావివలస వద్ద చూపరులను ఆకర్షించే ఎండల మల్లిఖార్జునస్వామి వారి ఆలయం ఉంది. పురాతన చారిత్రక ప్రదేశంగా, పురాణాల్లోను వీటి మహత్యం కలిగి ఉండేవిధంగా చరిత్ర ఉంది. అటువంటి రావివలస ఆలయ పరిధి పచ్చనైన పంట పొలాలతోను, కొండల ప్రాంతంగా కనువిందు చేస్తుంది. అటువంటి రావివలస క్షేత్రాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీనినీ పాలకులు పట్టించుకోకపోవడంతో ఈ ప్రదేశం కూడా నిరుపయోగం మారింది.

తేలినీలాపురం...

టెక్కలి మండలంలోని తేలినీలాపురం వద్ద సైబీరియా పక్షులు వచ్చి ఏడాదిలో సుమారు నాలుగు మాసాలు తమ అందాలతో కనువిందు చేస్తాయి. సైబీరియా దేశం నుంచి వలస వచ్చే ఈ పక్షుల విన్యాసాలు ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తాయి. దశాబ్ధాల కాలం నుంచి ఈ ప్రాంతానికి వచ్చే ఈ పక్షులు విన్యాసాలను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచీ పర్యాటకులు వస్తుంటారు. అటువంటి ఈ ప్రదేశాన్ని అభివృద్ధి చేయాలనే ఆలోచన నాటి పాలకుల ఉంది. కానీ, పర్యాటకంగా అభివృద్ధి మాత్రం కాలేదు సరికదా పక్షులకు సరైన రక్షణ లేదు. ఈ కేంద్రాన్ని పట్టించుకోకపోవడం పక్షుల రాకపోకలు తగ్గడమే గాకుండా, పర్యాటకుల తాకిడీ తగ్గడం గమనార్హం.

భావనపాడు...

టెక్కలి పట్టణానికి 20 కిలో మీటర్ల దూరంలోనే విశాలమైన భావనపాడు సముద్రతీరం ఉంది. ఇదీ పర్యాటకులను ఆకర్షించే విధంగా ఉంటుంది. టెక్కలి పట్టణానికి సమీపంలో ఆనేక వనరులున్నా... పర్యాటకంగా అభివృద్ధి చేస్తే బాగుంటుందని పట్టణ ప్రజలు కోరుతున్నారు. పాలకులు దృష్టిసారించి టెక్కలి ప్రాంతాన్ని పర్యాటక రంగంగా అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. ఇదిలాఉండగా మూలపేట పోర్టు నిర్మాణం, కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఇచ్చిన హామీ మేరకు భావనపాడు ఎయిర్ పోర్టు వంటివి మంజూరైతే టెక్కలికి ఒక గుర్తింపు ఉంటుంది. ఇటువంటి సమయంలోనే పర్యాటకరంగంగా టెక్కలిని తీర్చిదిద్దాలని పలువురు భావిస్తున్నారు. దీనిపై పాలకులు ఏ రీతిన స్పందిస్తారో వేచిచూడాలి.

అధ్వానంగా ప్రధాన రహదారులు

అధ్వానంగా ఉన్న రోడ్డు

ప్రజాశక్తి- కొత్తూరు

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల రహదారి, నివగాం, సామ్రాజపురం, ఆకులతంపర, పాతపాడు, కుంటిభద్ర, శిరుసువాడ రహదారులు అధ్వాన్నంగా మారడంతో పాటు గొట్టిపల్లి, లబ్బ గిరిజన గ్రామాల రహదారులు అధ్వానంగా మారడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు 5 ఏళ్ల నుంచి రహదారులు అధ్వానంగా మారడంతో ప్రజలు రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. అలాగే ఈ రహదారుల వలన అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా రోడ్లు భవనలు శాఖ అధికారులు స్పందించి రహదారులు మెరుగుపరచాలని స్థానికులు కోరుచున్నారు. ప్రధాన రహదారి మార్గంలో నిత్యం పాదచారులు, వాహనదారులు వేలాదిగా రాకపోకలు సాగిస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శిర్ల ప్రసాద్ ఆధ్వర్యంలో గతంలో స్థానిక నివాసితులతో రిలే దీక్షలు చేపట్టారు. అయినప్పటికీ అప్పటి ప్రభుత్వం స్పందించకపోవడంతో ఆ రహదారులు దుస్థితి అధ్వానంగా తయారయ్యాయి. అప్పటి టెక్కలి సబ్ కలెక్టర్ వచ్చి రహదారులు మెరుగుపరిచేందుకు నిర్మాణ వ్యయం ఎంత అవుతుందో అంచనా చేయాలని నీటిపారుదల శాఖ, రెవెన్యూ శాఖను ఆదేశించారు. అయితే రెవెన్యూ, నీటి పారుదలశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో మరమ్మతులకు నోచుకోలేదు.

నూతన ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టకపోడంతో ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతుంది. మండల కేంద్రానికి ఆటు ఒడిశా ఇటు మన్యం జిల్లా భామిని మండలం, సీతంపేట మండలాల నుంచి వ్యాపార వ్యవహారాల కోసం నిత్యం వేలాదిగా తరలిరావడంతో పాటు లారీల ద్వారా ఇసుక రవాణా చేస్తుండడంతో రహదారులు చిత్రమవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రహదారులు మెరుగుపర్చాలని కోరుచున్నారు.

మత్స్యకార గ్రామాల్లో క్రీడా మైదానాలు కరువు

నిలచిన గుల్లవానిపేట క్రీడా మైదానం పనులు

ప్రజాశక్తి- పోలాకి

మత్స్యకార గ్రామాల్లో యువకులు పెరుగుతున్నారు. కరోనా తరువాత పట్టణ ప్రాంతాల్లో సరైన ఉపాధి లేక, దూర ప్రాంతాలకు వెళ్లలేక యువకులు పల్లె ప్రాంతాల్లో ఉండటానికి ఆసక్తి చూపుతున్నారు. అయితే యువకులకు పల్లే ప్రాంతంలో ఉండి ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నారు. అయినా పల్లె ప్రాంతాల్లో ముఖ్యంగా మత్స్యకార గ్రామాల్లో ఎటువంటి క్రీడా సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని సముద్రతీరం గ్రామాలుగా రాజారాంపురం, కంబాళివానిపేట, అక్కువరం, కొత్తరేవు, చిన్నకొయిరుపేట, జోగంపేట, గుల్లవానిపేట, గుప్పిడిపేట, పెద్దకొయిరిపేట, పరపతివానిపేట, రేవుఅంపలాం, పల్లిపేట తదితర గ్రామాల్లో మత్స్యకార కుటుంబాలు నివశిస్తున్నారు. ఈ గ్రామాల్లో సుమారు 500 మంది యువకులు ఉన్నారు. అయితే ఈ గ్రామాలకు ఒకవైపు సముద్రం, మిగిలిన మూడు వైపులూ ఫారెస్టు భూములున్నాయి. ఈ గ్రామాల్లోని యువకులు క్రీడలపై ఆసక్తి కలిగి ఉన్నా... అడేందకు సుదూర ప్రాంతాల వెళ్లవలసి వస్తోంది. ఈ గ్రామాల్లోని యువకులు అధిక శాతం డిగ్రీలు పూర్తి చేసిన వారే ఉన్నారు. యువకులు రక్షణ రంగంలో ఉద్యోగాలు సంపాదించాలంటే శారీరకంగా పరిపుష్టత ఉండాలి. అలాగే పరుగు, లాంగ్ జంప్ వంటి వాటిలో ప్రావీణ్యం ఉండాలి. వాటికి ప్రాక్టీస్ చేసేందుకు క్రీడా మైదానాలు అవసరం. ఈ గ్రామాల్లో క్రీడా మైదానాలు లేక మళ్లీ పట్టణ ప్రాంతాల్లోకి వలస వెళ్లక తప్పడం లేదు. పాలకులకు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ప్రయోజనం లేదని ఆరోపిస్తున్నారు. 2014లో క్రీడాభివృద్ధిలో భాగంగా గుల్లవానిపేటలో క్రీడా మైదాన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని అప్పటి ప్రభుత్వం భరోసా ఇచ్చింది. దీంతో ఉత్సాహంతో గ్రామస్తులు సొంత డబ్బులతో క్రీడా మైదానాన్ని ఏరాపటుకు పనులు కూడా ప్రారంభించారు. వాటికీ నిధులు మంజూరు చేయలేదని సర్పంచ్ వారాది మోహనరావు, కొత్తరేవు మాజీ సర్పంచ్ కె.సూర్యప్రకాష్ తెలిపారు. ఈ విధంగా హామీ ఇచ్చిన ప్రభుత్వాలు మారిపోతున్నాయి.. కానీ, పనులు మాత్రం చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సౌకర్యాలు లేక యువకులు వలసబాట పట్టి నిరుద్యోగులుగా మారిపోతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి

డిసిసి అధ్యక్షులు పి.పరమేశ్వరరావు

ప్రజాశక్తి- టెక్కలి

ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేయడమే కాంగ్రెస్ పార్టీ ఎజెండా అని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ పేడాడ పరమేశ్వర రావు అన్నారు. 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ జిల్లా ప్రజలు గత పదేళ్లుగా అపరిష్కృత సమస్యలతో సతమతమవుతున్నారని అన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో టిడిపి అనేక హామీలు ఇచ్చిందని గుర్తు చేశారు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చామని పేర్కొన్నారు. జిల్లాలో సంస్థాగతంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తల్ని కలుపుకొని ఒక ప్రణాళికను సిద్ధం చేస్తున్నామన్నారు. జిల్లాలో వ్యవసాయ రైతాంగం, ఉద్దానం రైతులు, గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం దిశగా గత పదేళ్లుగా ప్రభుత్వం పని చేయలేదన్నారు. ప్రధాన, చిన్నతరహా ప్రాజెక్టులైనా వంశధార, నాగావళి, కళింగదళ్ వంటి వాటికి తక్షణం మరమ్మతులు చేపట్టి సంపూర్ణంగా ఆయకట్టు వినియోగానికి సిద్ధం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆఫ్‌షోర్ రిజర్వేయరుకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలన్నారు. గిరిజన సమస్యలు పరిష్కారం కోసం ఐటిడిఎ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా మొత్తం విద్యావంతులు ఆధారపడిన ఏకైక విద్యాసంస్థ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయానికి పూర్తి వసతులు, పూర్తి కాలం సిబ్బందిని సమకూర్చాలని, ఉద్దానం కిడ్నీ పరిశోధన కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని, వచ్చే సీజన్‌లోనైనా ఉద్దానం జీడి రైతు గిట్టుబాటు ధర కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కనీస అవసరాల కోసం ఆరాటపడుతున్న మూలపేట ప్రాంతం ప్రజానీకానికి, మత్స్యకారులకు కావలసింది భారీ నౌకాశ్రయాలు, విమానాశ్రయాలు కావని, జట్టీల నిర్మాణం, కోల్డ్ స్టోరేజ్‌ల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.



ఉప్పు రైతు గోడు పట్టదా?

● భూముల లీజులు రద్దు
● కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు సిద్ధం!

ప్రజాశక్తి- నౌపడ

నౌపడ.. ఈ పేరు వినగానే గుర్తొచ్చేది ఉప్పు పరిశ్రమ. గతంలో సుమారుగా ఐదు వేల కుటుంబాలు ఈ పంటపై ఆధారపడి జీవనం సాగించేవి. ప్రస్తుతం ఆ సంఖ్య వందల్లో ఉంది. మూడేళ్లుగా రైతులు, కార్మికులు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వలస కూలీలకు ఆశించిన స్థాయిలో పనులు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నౌపడ, ఇచ్ఛాపురం, పూండి, మర్రిపాడు, సెలగపేట, కళింగపట్నం, సీతానగరం, యామాలపేట, మూలపేట ప్రాంతాల్లో సుమారు ఐదు వేల ఎకరాల వరకు రైతులు ఉప్పు పండించేవారు. రాష్ట్రంతో పాటుగా ఇతర రాష్ట్రాలు పశ్చిమబెంగాల్, సతీష్‌ఘడ్, ఒడిశా, అస్సాం రాష్ట్రాలకు ఎగుమతి చేసే వారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ఉప్పు భూములు లీజు కాలపరిమితి ముగియడంతో రైతులు ఎవరు ఉప్పు పండించేందుకు ముందుకు రావడం లేదు. అక్కడక్కడ కొందరు రైతులు ఉప్పు పండిస్తున్నా వాతావరణం మార్పు, అధిక పెట్టుబడి, దళారులు చేతివాటంతో నష్టపోతున్నారు.

2013 సంవత్సరం నుంచి ఉప్పు ఉత్పత్తిదారులు లీజులు నిలిచిపోవడంతో వేలాది మంది కార్మికులకు ఉపాధి లేకుండాపోయింది. దీంతో లైసెన్స్ దారులు, కార్మికులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. లీజులు పునరుద్ధరించడంతోపాటు అసైన్మెంట్ ఫీజులు ప్రభుత్వాలు తగ్గించాలి. టెండర్ విధానంలో

సాగు చేయకుండా వదిలేసిన ఉప్పు మడులు

నౌపడలో పండించిన ఉప్పు

రెన్యువల్ చేయాలని వినతిపత్రం అందిస్తున్న ఉప్పు ఉత్పత్తిదారులు (ఫైల్)

ఉప్పు భూములు అప్పగించాలనే డిమాండ్ ఉన్నా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి కనీస స్పందన లేదు. ఈ ఏడాది రాష్ట్రంలో ఎక్కడా ఉప్పు సాగు ఆశించిన స్థాయిలో లేదు. రాష్ట్రంలో ఉప్పు పరిశ్రమ మనుగడ సాధించాలంటే లీజులు పునరుద్ధరణ చేయడం తప్పనిసరి.

జిల్లాలో సుమారు ఐదు వేల ఎకరాల భూములను ఉప్పు సాగుకు, కర్మాగారాలు కోసం కేంద్ర ప్రభుత్వం లీజుకు కేటాయించింది. ఇందులో 2,186 ఎకరాల్లో ఉప్పు పరిశ్రమలు ఉండగా 800 ఎకరాల్లో మాత్రమే ఉప్పు సాగవుతోంది. ఈ భూములను గతంలోనే రాష్ట్ర ప్రభుత్వం తిరిగి తీసుకునేందుకు నిర్ణయించింది. ఈ మేరకు సాల్ట్ ఇండస్ట్రీస్ కమిషన్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదన పంపింది. భూముల లీజు కాలం ముగిసేందుకు ఇంకా కొంత గడువు ఉన్నందున అక్కడక్కడ ఉప్పు సాగు అవుతుంది. మరోవైపు నౌపడలో చాలా వరకు ఉప్పు భూములు మూలపేట పోర్టు నిర్మాణంలో భాగంగా రైలు, రోడ్డు మార్గాలకు, పోర్టు కార్యకలాపాలకు, పోర్టు అనుబంధ పరిశ్రమలకు భూములు కోల్పోవాల్సి ఉంటుంది. పోర్టు నిర్మాణం జరిగితే దాని చుట్టుపక్కల బడా కార్పొరేట్లకు అధిక మొత్తంలో భూములు కేటాయించే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటికే బిపిసిఎల్ వంటి పెద్ద పెద్ద సంస్థలు, అంబానీ, ఆదాని గ్రూప్ సంస్థలు ఈ భూములపై కన్నేశారు. ఇవన్నీ ముందే ఊహించిన కేంద్ర ప్రభుత్వం రైతులకు లీజులు నిలుపుదల చేసింది. ఈ-టెండర్ ప్రక్రియ ద్వారా కార్పొరేట్లకు చౌకగా భూములు కట్టబెట్టేందుకు సిద్ధమవుతుందని ఆ శాఖ అధికారుల నుంచి సమాచారం. కార్పొరేట్లకు భూములు వెళ్తే... ప్పుడు సాగనేది చరిత్రలోనే తప్ప ఈ ప్రాంతంలో కనిపించదు. దీనిపై ప్రభుత్వాలు ఏ నిర్ణయం తీసుకుంటాయోనని రైతుల ఆందోళనకు గురవుతున్నారు.

మూతపడుతున్న పరిశ్రమలు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

వందలాది మంది కార్మికులకు ఉపాధి కల్పించే పరిశ్రమ మూతపడడంతో కార్మికులు రోడ్డున పడ్డారు. పరిశ్రమనే నమ్ముకుని జీవనం సాగిస్తున్న కార్మిక కుటుంబాలు అర్థాకలితో జీవితాలను సాగిస్తున్న పరిస్థితులు నెలకొంటున్నాయి. ప్రస్తుత సిఎం నారా చంద్రబాబునాయుడు, మాజీ సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డితో సహా ఇతర నేతలు కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేరకపోవడంతో జీవనోపాధి లేక కార్మికులు ఎదురుచూస్తున్న పరిస్థితులు నెలకొంటున్నాయి. టెక్కలి మండలం రావివలసలో ఉన్న మెట్కోర్ అల్లాయిస్ పరిశ్రమ గత టిడిపి ప్రభుత్వ హయాంలో లాకౌట్ అయ్యింది. జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో అటుగా వచ్చిన సందర్భంగా కార్మికులు పరిశ్రమను తెరిపించాలని అప్పట్లో వినతిపత్రం అందించారు. అయితే అధికారంలోకి వచ్చిన వెంటనే పరిశ్రమను తెరిపించి స్థానికులకు ఉపాధి కల్పిస్తామని ప్రతిపక్ష నేత హోదాలో అప్పట్లో జగన్

రోడ్డున పడిన కార్మికులు

కార్మికులకు హామీనిచ్చారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చిన సుమారు రెండేళ్ల అనంతరం పరిశ్రమ తెరుచుకున్నా.. పరిశ్రమ తెరుచుకున్న కొద్దిరోజులు నుంచే ఇక్కడ వివాదాలు మొదలయ్యాయి. పరిశ్రమలో గతంలో పనిచేసిన రెగ్యులర్ కార్మికులకు రావాల్సిన బకాయిలు, ఇతర ఆర్థిక పరమైన అంశాలపై తేల్చాలని, అదేవిధంగా స్థానికులకు పరిశ్రమలో ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ అప్పట్లో ధర్నాలు, నిరసనలు కొనసాగాయి. కొన్ని నాటకీయ పరిణామాల నేపథ్యంలో కొద్ది నెలల పాటు పరిశ్రమను ఒక సంస్థ నడిపినప్పటికీ తరుచూ శాంతి భద్రతలకు సంబంధించిన అంశాలపై ఇక్కడ సమస్యలు ఎదురవుతూ వచ్చాయి. పరిశ్రమలో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్టు, రోజుకూలీలు తరుచూ ఏదో ఒక విషయంలో పరిశ్రమ యాజమాన్యం తీరును వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమాలు చేపడుతూ వచ్చారు. పరిశ్రమలో ఉపాధి కల్పన, బకాయిలు, వేతనాలు ఇతర అంశాలపై పలుమార్లు వివిధ శాఖల అధికారులు, పరిశ్రమ యాజమాన్యం, కార్మిక సంఘ నాయకులతో చర్చలు జరిపారు. అయితే ఇలా జరుగుతున్న నేపథ్యంలో జూలై 31 పరిశ్రమకు ఉన్న ఫలంగా యాజమాన్యం లాకౌట్ నోటీసులు అతికించి, ప్రొడక్షన్ తయారీను నిలుపుదల చేయడంతో కార్మికుల సమస్యలు మళ్లీ మొదటికి వచ్చింది. ఎనిమిదేళ్ల నిరీక్షణ అనంతరం తెరుచుకున్న పరిశ్రమ ఏడాదిన్నర కాలంలోనే మళ్లీ మూతబడడంతో కార్మికులు ఉపాధికి దూరమయ్యారు. పరిశ్రమను మరలా తెరిపించి కార్మికులకు, స్థానికులకు ఉపాధి కల్పించాలని పలువురు కోరుతున్నారు.

మూతపడిన ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమ

ప్రభుత్వం విఫలం

రావివలస పెర్రోఎల్లాయిస్ పరిశ్రమ తెరిపించడంలో విఫలమయ్యారు. జీఎంఆర్ నిర్మాణం చేపట్టిన ఈ పరిశ్రమ కొంతమంది కార్పొరేటు కంపెనీలకు లీజులు ఇచ్చి మూతపడేటట్లు చేస్తున్నారని ఆరోపించారు. కార్మికులకు వేతనాలు చెల్లించకుండా మూత వేయడం దారుణమని కార్మికులు చెల్లింపులు చేసి మూత వేస్తే మరొక పని చూసుకుంటారని తెలిపారు. అలాకాకుండా కార్మికులకి తెలియపరచుకోండి రాత్రికి రాత్రే లాకౌట్ చేయడము దారుణం అన్నారు.

- ఎన్.షణ్ముఖరావు, సిఐటియు నాయకులు

శిథిలావస్థలో తుపాను రక్షిత భవనాలు

ప్రజాశక్తి- సంత బొమ్మాళి

తీరంలో ఏటా అక్టోబరు, నవంబరు నెలల్లో తప్పనిసరిగా తుపాన్లు వస్తూ.. ఉంటాయి. తుపాను వస్తే తీర ప్రాంత ప్రజలకు రక్షణ కరవుతుంది. గతంలో తుపాన్లు వచ్చేటప్పుడు అధికారులు తీర ప్రాంత ప్రజలను తుపాను రక్షిత భవనాలకు వాహనాల ద్వారా తరలించి వారిని రక్షణ కల్పించేవారు. తుపాన్ల తీవ్రత తగ్గేవరకు ఈ భవనాల్లోనే వారిని ఉంచి భోజన వసతులు, పునరావాసం కల్పించే వారు. కానీ, ఇప్పుడు తుపాన్లు వస్తే పరిస్థితి ఏంటని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. గతంలో తీర ప్రాంత గ్రామాల్లో తుపాను రక్షిత భవనాలు ఉండడంతో ఎంత తీవ్ర తుపాను వచ్చినా ఆ భవనాలు ఉన్నాయని భరోసా ఉండేది. మిగతా రోజుల్లో ఆ భవనాలను శుభకార్యాలకు, సమావేశాలకు ఉపయోగించే వారు, కానీ, ఇప్పుడు తుపాన్లు వస్తే ఎక్కడికి వెళ్లాలనేది తీర ప్రాంత ప్రజలు ఆవేదన చెందుతున్నారు. మండలంలోని తీర ప్రాంతంలోని రక్షిత భవనాలు కొన్ని శిథిలావ్యవస్థకు చేరుకున్నాయి. మరికొన్ని గ్రామాల్లో మరికొన్ని శిథిల వ్యవస్థకు చేరడంతో వాటిని పూర్తిగా తొలగించేశారు. ఈ భవనాలు తొలగించాలంటే కలెక్టర్ అనుమతులు ఉండాలి. కానీ, అవేవీ ఉన్నాయో? లేదో? తొలగించిన వారికే తెలియాలి. మండలంలోని మరువాడ, జగన్నాథపురం, కె.లింగూడు, ఎం.సున్నాపల్లి, సంధిపేట, గెద్దలపాడు, పాతమేఘవరం గ్రామాల్లో పూర్తిగా తొలగించడంతో తపాను రక్షిత భవనాలు ఆనవాలు కనుమరుగైపోయాయి. సూరాడవానిపేట, పెట్టవానిపేట, భావనపాడు, ఉమిలాడ, మలగాం గ్రామాల్లో

భవనాల పూర్తిగా శిథిలావస్థ చేరుకున్నాయి. ఆర్.సున్నాపల్లి, మేఘవరం, రుంకు, కొల్లిపాడులో మాత్రమే కొత్త భవనాలు నిర్మించారు. రాబోయేది వర్షాకాలం కావున తుపాన్లు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. తుపాన్లు వస్తే రక్షిత భవనాలు తొలగించిన దగ్గర, శిథిలావస్థకు చేరుకున్న దగ్గర తీర ప్రాంతం ప్రజలకు అధికారులు రక్షణ ఎలా కల్పిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గతంలో తీర ప్రాంతంలో తుపాన్లు వచ్చినప్పుడు వారికి రక్షణ కల్పించడానికి, పునరావాసం కల్పించడానికి సుమారు 35 ఏళ్ల క్రితం అప్పటి కేంద్ర ప్రభుత్వం తీర ప్రాంత గ్రామాల్లో తుపాను రక్షిత భవనలు నిర్మించారు. 15 ఏళ్ల క్రితం కొన్ని భవనాలకు మరమ్మతులు చేపట్టారు. వాటిని వినియోగంలో తేవడంలో అధికారులు విఫలమయ్యారని తీర ప్రాంత ప్రజలు వాపోతున్నారు. రక్షిత భవనాలు తొలగించిన స్థలాలు అన్యాక్రాంతమవుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తీర ప్రాంతంలో గతంలో ఉన్న రక్షిత భవనాలు స్థానంలో కొత్త భవనాలు నిర్మించి తీర ప్రాంత వాసులకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

'ఆఫ్‌షోర్' పూర్తయ్యేదెప్పుడో?

- **నిర్వాసిత గ్రామాలకు తప్పని తిప్పలు**
- **15 ఏళ్లుగా 60 శాతం పనులు పూర్తి**
- **కొత్త ప్రభుత్వంపై అన్నదాతల ఆశలు**

ప్రజాశక్తి- నందిగాం

పలాస, వజ్రపుకొత్తూరు, మెళియాపుట్టి, నందిగాం మండలాల్లో 24,600 ఎకరాలకు సాగునీరు, పలాస- కాశీబుగ్గ పట్టణాలతో పాటు మరో 30 గ్రామాలకు తాగునీరు అందించే బృహత్తర పథకం ఆఫ్‌షోర్ జలాశయం. దీని నిర్మాణానికి 2008లో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి పలాస మండలం రేగులపాడు వద్ద శంకుస్థాపన చేశారు. రూ.127 కోట్లతో ప్రారంభించిన ప్రాజెక్టు మధ్యలో నిలిచిపోయింది. 2019 జూన్, నాటికి ఆఫ్‌షోర్ జలాశయం పనులు పూర్తి చేసి సాగునీరు అంది. టిడిపి హయాంలో అప్పటి మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు. నిర్మాణం అంచనా రూ.460 కోట్లకు పెరిగింది. పనులు 47 శాతం పూర్తయ్యాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన జగన్ సర్కారు ప్రాజెక్టు పూర్తి చేసేందుకు రూ.855 కోట్లు కేటాయించింది. అయితే రూ.300 కోట్లు మాత్రమే నిధులు విడుదలైనట్లు అధికారులు పేర్కొన్నారు. నిర్వాసిత గ్రామాల ప్రజలకు, కుడి కాలువకు భూములు ఇచ్చిన వారికి ఈ నిధులతో పరిహారం అందించారు. కుడికాలువ మదుములు, కరకట్ట నిర్మాణం పూర్తి చేశారు. అయిదేళ్ల వైసిపి పాలనలో 3 శాతం మాత్రమే పనులు జరిగాయి. దీంతో కూటమి ప్రభుత్వంపై అన్న దాతలు ఆశలు పెట్టుకున్నారు.

మండలంలోని శారదాపురం- చిన్నగురువూరు గ్రామాలను, ప్రజలను నిర్వాసితులను చేసి ఎంతో ప్రతిష్టాత్మకంగా 2008 ఏప్రిల్ 4న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్యే హనుమంతు అప్పయ్యదార కృషి ఫలితంగా ఆఫ్‌షోర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అయితే 15 ఏళ్లు కావస్తున్నా ఆఫ్‌షోర్ పనులు నత్తనడకనే సాగుతున్నాయి. ఇప్పటివరకు కేవలం 60 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. నందిగాం, పలాస, వజ్రపుకొత్తూరు, మెళియాపుట్టి మండలాల్లోని 24,600 ఎకరాలకు సాగునీరు అందించి సస్య శ్యామలం చేయాలని, అలాగే పలాస కాశీబుగ్గ జంట పట్టణాల ప్రజలకు తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఈ రిజర్వాయర్ పనులకు శంకుస్థాపన చేశారు. రిజర్వాయర్ నిర్మాణానికి 1584 ఎకరాల విస్తీర్ణంలో పనులు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం ఈ పనులు నత్తనడక సాగుతున్నాయి. పూర్తిస్థాయిలో నిధులు కేటాయించకపోవడం, నిర్వాసితులకు పరిహారం, పునరావాసం పూర్తిస్థాయిలో కల్పించకపోవడం తదితర కారణాలతో గడిచిన 15 ఏళ్లలో 60 శాతం మాత్రమే పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు పూర్తి కావాలంటే ఇంకెన్నాళ్లు పడుతుందోనని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రూ.127 కోట్ల వ్యయంతో జలాశయ పనులు ప్రారంభించినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిధులు విడుదల కాకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆరేళ్ల కాలంలో 12 శాతం మాత్రమే పనులు జరిగాయి. 2014 ఎన్నికల సమయంలో ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామని టిడిపి నాయకులు హామీ ఇచ్చినప్పటికీ 2015 వరకు ఎటువంటి నిధులు విడుదల కాలేదు. 2017లో పలాస ఎమ్మెల్యే గౌతు శ్యామసుందర శివాజీ గడ్డం దీక్ష చేపట్టడంతో ప్రభుత్వంలో కదలిక వచ్చి రూ.466.23 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులతో 2018 జూన్ నాటికి ఆఫ్‌షోర్ పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించేలా కృషి చేస్తానని ప్రాజెక్టు పరిశీలనకు వచ్చిన అప్పటి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు 60శాతం పనులు మాత్రమే జరిగాయి. టిడిపి హయాంలో ఐదేళ్లలో 39 శాతం పనులు జరిగాయి. 2018 జూన్‌లో గడువు ముగిసినా 2019 జూలై 30 వరకు గడువు పొడిగించారు. గడువు పూర్తయినా రిజర్వాయర్ పనుల్లో కదలిక కనిపించలేదు.

ఆఫ్‌షోర్ ఆనకట్ట ప్రధాన గట్టు

రైతుల ఆశలపై నీళ్లు

ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు వైసిపి హయాంలోనైనా పూర్తవుతాయో లేదోనని ప్రజలు, రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. గతంలో కేటాయించిన నిధులు ఎందుకు సరిపోవని, ప్రస్తుత ధరలకు అనుగుణంగా జిల్లా యంత్రాంగం రూ.533 కోట్ల అంచనా వేసి నివేదించినట్లు అధికారులు చెప్పారు. ఇప్పటివరకు కేటాయించిన నిధుల్లో సుమారు రూ.225 కోట్లు భూసేకరణ, నిర్వాసితులకు పరిహారంగా అందించారు. మరో రూ.87.34 కోట్లతో 51 శాతం వరకు పనులు పూర్తి చేశారు. మిగిలిన 49శాతం పనులు పూర్తిస్థాయిలో జరగాలంటే వైసిపి జిల్లా మంత్రులపై రైతులు ఆశలు పెంచుకున్నారు. తగిన స్థాయిలో మంత్రుల నుంచి ప్రాజెక్టు నిర్మాణ పనులపై ప్రాధాన్యత లేకపోవడంతో ఆఫ్‌షోర్ నిర్మాణ పనులు తూతూ మంత్రంగానే సాగాయి. జలాశయం నిర్మాణ పనుల్లో భాగంగా ఇప్పటివరకు 16 కిలోమీటర్ల వరద కాలువలు పనులు చేపట్టాల్సి ఉండగా కేవలం 10 కిలోమీటర్లు మాత్రమే పూర్తి చేశారు. ఇంకా 12 కిలోమీటర్ల వరకు నిర్మించాల్సి ఉంది. స్టిల్ వే రెగ్యులేటర్ ఫౌండేషన్, కాంక్రీట్ పనులు చేపట్టాల్సి ఉంది. రాతికట్ట నిర్మాణాలు రెండు కిలోమీటర్ల నుంచి మూడు కిలోమీటర్ల వరకు పూర్తి చేయగా ఇంకా మరో ఒకటిన్నర కిలోమీటర్ల వరకు పనులు జరగాల్సి ఉంది.

ఈ పనులన్నీ పూర్తి చేసి మహేంద్ర తనయ నుంచి కాలువ నిర్మించాల్సి ఉంది. ప్రస్తుతం కాలువ నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఈ పనులకు భూ సేకరణ చేయాల్సి ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టు రైతుల్లో సందేహాలను నెలకొనేలా పరిస్థితులు మారాయి. నిర్వాసితు ల పరిహారం చెల్లించడంలో పునరావాసం కల్పించడంలో చోటు చేసుకున్న జాప్యం కారణంగా ఆలస్యం అవుతున్నాయి. ఆఫ్‌షోర్ జలాశయ ప్రాంతంలోనే పలాస మండలంలోని రేగులపాడు, మెళియాపుట్టి మండలంలోని దాసుపురం, చీపురుపల్లి, నందిగాం మండలంలోని శారదాపురం, చిన్న గురువూరు గ్రామాలు ముంపునకు గురి కానున్నాయని అధికారులు గుర్తించి ఆయా గ్రామాలను నిర్వాసిత గ్రామాలుగా గుర్తించి సుమారు 1150 ఇళ్లను ఖాళీ చేయించి నిర్వాసిత గ్రామాల ప్రజలకు పలాస మండలం కోసంగిపురం జంక్షన్ వద్ద టెక్కలి పట్నం వద్ద కమలాపురం, దాసపురం ప్రాంతాల్లో ఇళ్లస్థలాలు కేటాయించారు. గత ఐదేళ్లలో వైసిపి పాలనలో కేవలం ఆఫ్‌షోర్ నుంచి కుడి ప్రధాన కాలువకు మధుం నిర్మించారు. ఒక కిలోమీటరు మేర పిల్ల కాలువ పనులను మాత్రమే చేపట్టారు. ఆఫ్‌షోర్ గట్టుపై మట్టి వేసి పనులు శరవేగంతో సాగుతున్నాయే మోనన్న ఆశలు రైతుల్లో చిగురించాయి. అయితే ఆ ఆశలు ఆశలుగానే మిగిలిపోయాయి. ఈ నిర్మాణ పనుల్లో జాప్యం జరగడంతో ప్రతిఏటా రైతులు కరువు కోరాల్లో చిక్కుకుంటున్నారు. దీంతో మండలంలోని సన్న, చిన్న కారు రైతులతో పాటు వ్యవసాయ కూలీలు వలస బాట పట్టక తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇంతవరకు పూర్తయిన పనులు

వరద కాలువ 13.575 కి.మీ. గానూ 10 కి.మీ. పూర్తి చేశారు. మెళియాపుట్టి మండలం అర్చనాపురం వద్ద 5,950 నుంచి 6.550 కి. మీ. మధ్యలో సుమారు 600 మీటర్ల మేర టన్నెల్ నిర్మాణం జరుగుతుంది. సిఎంసిడి పనులు 24 చేయాల్సి ఉండగా, 15 పూర్తి చేశారు. హోటింగ్ జోన్ (ఎర్త్ బండ్) 2.485 కి. మీ. నుంచి 0.300 వరకు నిర్మాణం జరిగింది. 7 మీటర్ల ఎత్తు వరకు పూర్తయింది. హోరి జంటల్ శాండ్ ఫిల్టర్ పనులు 2.4 కి. మీ. నుంచి 2.5 వరకు పూర్తి చేశారు. 1.4 కి.మీల నుంచి 12 వరకు జరగాల్సి ఉంది. లి రాక్ట (రాతికట్ట) నిర్మాణ పనులు 2,300 కి.మీ. నుంచి 2 వరకు వరకు పూర్తి చేశారు. ఇంకా 1.300 కి.మీ. వరకు మిగిలి ఉంది.

ఆక్రమణలు తొలగిస్తే సస్యశ్యామలమే

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

కోటబొమ్మాళి మండలం పరిధిలో మొత్తం 323 చెరువులు ఉన్నాయి. కొన్ని చెరువులు ఆక్రమణలకు గురయ్యాయి. ఆక్రమణలు తొలగిస్తే మండలం సస్యశ్యామలమవుతుంది. బందల కింద 9,580 ఎకరాల్లో భూమి సాగవుతున్నట్లు రికార్డులు తెలుపుతున్నాయి. అయితే ఇది జిరాయితీ. ఇది కాక ఇమామ్ భూములు పరిధిలో మరో రెండు వందలపైగా చెరువులు, బందరు ఉన్నాయి. అయితే అవి ప్రభుత్వ రికార్డుల్లోకి చేరలేదు. ఇనాం భూములు రద్దయినా ఆ భూములు, ఆ చెరువులు రెవెన్యూ రికార్డుల్లోకి చేరకపోయినా ఆ భూములకు మాత్రం సాగుదారుడు నుంచి సిస్తు వసూలు మాత్రం చేస్తున్నారు. అయితే ఇనాం భూములకు పాస పుస్తకాలు సాగుదారునికి చాలా మందికి ఇప్పటివరకు అందజేయలేదు. కాకాగా, మండలంలో మొత్తం చెరువులు ఎంతో కొంత ఆక్రమణలకు గురికాగా, చాలావరకు బందలు చిన్నచిన్న నీటి కుంటలు నామరూపాలు లేకుండాపోయాయి. పైగా వాటి స్వరూపం స్వభావమే మారిపోయింది. ఈ చెరువులో బందలు, పెత్తందారుల కబంధాల హస్తాల్లో ఉండటం వల్ల వారి దాన బలం. అధికార బలం ఉండడంతో ఆక్రమణలు తొలగించడానికి ఎవరూ సాహసించడం లేదు.

చెరువుల విస్తీర్ణం

కోటబొమ్మాళి గ్రామం పరిధిలో 27.02 ఎకరాల విస్తీర్ణం గల అనంత చెరువు, 15.50 ఎకరాల విస్తీర్ణం గల దీనకర్ర చెరువు, 25 పాయింట్ ఎనిమిది ఎకరాల విస్తీర్ణం గల జగ్గుబంద, 26.96 ఎకరాల మదిమంద, 28.30 ఎకరాల విస్తీర్ణం గల తాడబంద, 12.90 ఎకరాల విస్తీర్ణం గల కుమ్మరి పూను, 24 పాయింట్ 80 ఎకరాల విస్తీర్ణం గల రఘు చెరువు, 13.54 ఎకరాల విస్తీర్ణం గల కృష్ణసాగరం, 23.18 ఎకరాల విస్తీర్ణం గల తెడ్డు చెరువు, 9.82 ఎకరాల విస్తీర్ణం గల దాసుడు చెరువు, 13.54 ఎకరాల విస్తీర్ణం గల కృష్ణసాగరం, 53.70 ఎకరాల విస్తీర్ణం గల నేరెళ్ల చెరువు, 38.87 ఎకరాల ధర్మసాగరం 18.10 ఎకరాల విస్తీర్ణం గల హరి చెరువు, 96.58 ఎకరాల విస్తీర్ణం గల లక్ష్మణ చెరువు, 23.97 ఎకరాల విస్తీర్ణం గల పెద్ద చెరువు రికార్డుల్లో ఉన్నాయి. అలాగే నారాయణవలస పరిధిలో 22 ఎకరాల రామన్న చెరువు, 79.3 ఎకరాల విస్తీరంగాల బురియనాయుడు చెరువు, 38.87 ఎకరాల విస్తీర్ణం గల సరఫన చెరువు, 37.43 ఎకరాల విస్తీర్ణం గల తుమ్మబాయి చెరువు రికార్డుల్లో ఉన్నాయి.

బోరుమద్దిపాలెం పరిధిలో...

బోరుమద్దిపాలెం పరిధిలో 54.93 ఎకరాలు విస్తీర్ణం గల పెద్ద చెరువు, 40 ఎకరాల విస్తీర్ణం గల గుడ్డు వెంకన్న చెరువు, 16.28 ఎకరాల విస్తీర్ణం గల

కోటబొమ్మాళి పెద్ద చెరువు

వేపబంద చెరువు, 38.92 ఎకరాల విస్తీర్ణం గల రామసాగరం రికార్డుల్లో ఉన్నాయి. చవితిపేట గ్రామ పరిధిలో 16.25 ఎకరాల విస్తీర్ణం గల గొల్లవాని చెరువు, పట్టాచిరుచిట్టేవలస గ్రామ పరిధిలో 31.93 ఎకరాల వెంకట చెరువు, 13.72 ఎకరాల దవళవాని చెరువు, 11.86 ఎకరాల విస్తీర్ణం గల బుచ్చుమ్మ బంద, 18.73 ఎకరాల విస్తీర్ణం గల మామిడి చెరువు, 95 సెంట్లు 5.21 ఎకరాల విస్తీర్ణం గల ఇనామ్ చెరువు, 17.7 ఎకరాల విస్తీర్ణం గల మర్రిబంద, 24.30 ఎకరాలు విస్తీర్ణం అయ్యప్ప చెరువు, 9.58 ఎకరాల విస్తీర్ణం గల మోదు కర్ర చెరువు, 12 ఎకరాల విస్తీర్ణం గల మింగు భవన చెరువు, 36.76 ఎకరాల విస్తీర్ణం గల రామన్న చెరువు, 42.5 ఎకరాల తులసి కర్ర చెరువు, 17.9 ఎకరాల విస్తీర్ణం గల పాపుడు చెరువు రికార్డులో ఉన్నాయి. గంగారం పరిధిలో 68.83 ఎకరాల చింతవరం, 84.44 ఎకరాల విస్తీర్ణం గల కొత్తచెరువు, 38.19 ఎకరాల రాముడు కర్ర చెరువు, 406.47 ఎకరాల సర్వే నంబరు 84లో ఉన్న చెరువు 38.27 ఎకరాలు విస్తీర్ణం గల కొండగడ్డ పూను రికార్డుల్లో ఉన్నాయి. జర్జాంగి పరిధిలో 113.17 ఎకరాల మినపల చెరువు, 52.74 ఎకరాల తమన్న చెరువు, 19.98 ఎకరాల సంగమయ్య చెరువు, 83 ఎకరాలు విస్తీర్ణ గల పావురమంద చెరువు రికార్డుల్లో ఉన్నాయి. కస్తూరిపాడు పరిధిలో 100.18 ఎకరాల అడవి పూను చెరువు, 49.92 ఎకరాల విస్తీర్ణం గల పుట్టి బంధ చెరువు, 23.76 ఎకరాల విస్తీర్ణం గల అప్పుడు బంద, 12.55 ఎకరాలు విస్తీర్ణం గల లక్ష్మీసాగరం 15.5 ఎకరాల విస్తీర్ణం గల రామసాగరం, 2.75 ఎకరాల విస్తీర్ణం గల ఆదినారాయణ, 100.99 ఎకరాల పాలవానిబంద రికార్డుల్లో ఉన్నాయి. కొత్తపేట గ్రామ పరిధిలో 93.93 ఎకరాల గూడెం చెరువు, 27 ఎకరాల విస్తీర్ణం గల పెద్ద అలిసిపేట చెరువు, 3.9 ఎకరాల విస్తీర్ణం గల పెద్దబంద రికార్డులో ఉన్నాయి.

మహాసాహేపేట పరిధిలో...

మహాసాహేపేట గ్రామం పరిధిలో 80.73 ఎకరాల విస్తీర్ణం గల పెద్ద చెరువు, 23.75 ఎకరాల ఎర్ర చెరువు, 98.96 ఎకరాల రామసాగరం రికార్డుల్లో ఉన్నాయి. అలాగే నిమ్మాడ పరిధిలో 6.22 ఎకరాల ధర్మాన చెరువు, 32.98 ఎకరాల కొత్తచెరువు, 16.42 ఎకరాల విస్తీర్ణం గల కింద 34.67 ఎకరాల విస్తీర్ణం గల పాత చెరువు, 14.74 ఎకరాలు విస్తీర్ణం గల శంకర్ చెరువు, 7.98 ఎకరాల విస్తీర్ణం గల గడ్డివాని చెరువు రికార్డుల్లో ఉన్నాయి. పట్టపురం పరిధిలో 6.50 ఎకరాల విస్తీర్ణం గల బ్రహ్మన్న చెరువు, 40.30 ఎకరాల లొట్టి, వంద 56.8 ఎకరాల విస్తీర్ణం గల పున్నా చెరువు, 21. 44 ఎకరాల విస్తీర్ణం గల కొత్తచెరువు రికార్డుల్లో ఉన్నాయి. రేగులపాడు గ్రామ పంచాయతీ పరిధిలో 79.19 ఎకరాల వెంకట సాగరం, 72.28 ఎకరాలు విస్తీర్ణం గల సీత సాగరం, 23.69 ఎకరాలు గల చంద్రయ్య చెరువు, 38.87 ఎకరాల విస్తీర్ణం గల పల్లివానిపేట, చెరువు 409.60 ఎకరాల విస్తీర్ణం గల చర్మసాగరం, 66.7 ఎకరాలు విస్తీర్ణం గల వ్యాధులు కర్ర చెరువు, 34.98 ఎకరాలు విస్తీర్ణం గల వేపకార చెరువు 68.66 ఎకరాల విస్తీర్ణం గల ములిసావేదుల కర్ర చెరువు రికార్డుల్లో నమోదై ఉన్నాయి.

డిగ్రీ పట్టాతో ఉద్యోగం.. ఇదీ 'పద్మావతి' నినాదం

ప్రజాశక్తి- నరసన్నపేట

'నాటి డిగ్రీ కేవలం నిరుద్యోగాన్ని మిగిల్చేదైతే... ప్రస్తుతం పద్మావతి కళాశాలలో డిగ్రీ కచ్చితంగా ఉద్యోగాన్ని ఇస్తుంది' ఇది పద్మావతి డిగ్రీ కళాశాల నినాదం. నూతన ఆవిష్కరణలు, సరికొత్త విధానాలతో డిగ్రీ కళాశాలలకు తలమానికంగా నిలుస్తూ... నూతన ఒరవడి సృష్టించి యూనివర్సిటీ స్థాయి పరీక్షల్లో, పోటీ పరీక్షల్లో కొత్త రికార్డులు నెలకొల్పుతుంది నరసన్నపేట పద్మావతి డిగ్రీ కళాశాల.

సిహెచ్.దుర్గాప్రసాద్
డైరెక్టర్, పద్మావతి డిగ్రీ కళాశాల

పాఠ్యప్రణాళికే కాకుండా క్యాంపస్ రిక్రూట్మెంట్ ట్రైనింగ్ వంటి ప్రత్యేక శిక్షణ ఇస్తూ... ఇంజినీరింగ్ విద్యకు ధీటుగా అన్ని విధాలుగా దిబెస్ట్ అంటూ విజయబావుటా ఎగరవేస్తుంది పద్మావతి డిగ్రీ కళాశాల. ప్రతి విద్యార్థిని ప్రగతి పథంలో నడిపిస్తూ యూనివర్సిటీ సిలబస్‌తో పాటు క్యాంపస్ సెలక్షన్స్ లక్ష్యంగా మార్గదర్శకత్వాన్ని అందిస్తుంది. విద్యార్థి హాజరు, ప్రగతి రిపోర్టులను ఎప్పటికప్పుడు తెలియజేస్తూ తల్లిదండ్రులు మన్ననలను పొందుతుంది. విద్యారంగంలో జరుగుతున్న మార్పులకు అనుగుణంగా యూనివర్సిటీ నిబంధనల ప్రకారం ఒత్తిడి లేని విద్యా విధానాన్ని విద్యార్థులకు అందిస్తుంది. ఈ కళాశాలలోని స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థతో ఎంప్లాయిమెంట్ స్కిల్ సెంటర్ విద్యార్థులకు ఒక వరం. ఇక్కడ డిగ్రీ మొదటి ఏడాది నుంచే ప్రారంభమయ్యే ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ప్రోగ్రాంలో సైన్స్ విద్యార్థులతో పాటు ఆర్ట్స్ విద్యార్థులు భాగం అవుతారు. వీరికి అర్ధమటిక్, రీజనింగ్, ఇంగ్లీష్ తదితర అంశాల్లో ప్రత్యేక శిక్షణ అందిస్తారు. చదువులో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని, జీవితంలో అత్యున్నత శిఖరాలు అధిరోహించాలని, ఆకాశమంత ఎత్తుకు ఎదగాలని ప్రతి విద్యార్థీ కలలు కంటాడు. విద్యార్థి కలలు నిజం చేసుకోవాలంటే దీక్ష, పట్టుదలతో పాటు అంతర్గతంగా ఉన్న తనశక్తి సామర్థ్యాలను బయటకు తీసే ప్రయత్నం పద్మావతి చేస్తుంది. విద్యార్థులకు సెమినార్లు నిర్వహించి కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్‌పై ప్రత్యేకత శిక్షణ అందిస్తారు. వివిధ రంగాల్లో విశేష అనుభవం గడించిన వారితో అవగాహనా సదస్సులు ఇక్కడ తరచూ నిర్వహిస్తారు. బికాం విద్యార్థులకు పరిశ్రమల ఏర్పాటుకు వీలుగా ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు, వివిధ బ్యాంకు ప్రతినిధుల తో సెమినార్లు నిర్వహిస్తారు. కంప్యూటర్ రంగంలో వస్తున్న మార్పులు ఆధారంగా ఇక్కడ కంప్యూటర్ సైన్సు విద్యార్థులకు యూనివర్సిటీ సిలబస్‌తో పాటు డేటా సైన్సు, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, రోబోటిక్స్, అనిమేషన్ తదితర అంశాల్లో నిష్ణాతులైన అధ్యాపకులతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. గ్రామీణ ప్రాంతపు విద్యార్థులకు సివిల్స్ పరీక్షలపై అవగాహనా కోసం అందుబాటులో ఉన్న అధికారులతో ముఖాముఖి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.



ప్రజాశక్తి
44వ వార్షికోత్సవ
శుభాకాంక్షలు
ప్రతి అక్షరం ప్రజల పక్షాన నిలుస్తూ...
దినదిన అభివృద్ధి చెందుతున్న
'ప్రజాశక్తి' దినపత్రికకు 44వ వార్షికోత్సవ
శుభాకాంక్షలు
రాజగోపాలరావు
ఎ.డి. పశువైద్యాశాఖ, నరసన్నపేట

ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ
శుభాకాంక్షలు
బగాది ప్రసాదరావు
ఎం.పి.ఒ.ఎం.జి ఎన్ఆర్ఇజిఎస్
కార్మికులు, కర్షకులు, శ్రామిక వర్గాల
అభ్యున్నతి కోసం నిరంతరం అక్షర సమరం
చేస్తున్న ప్రజా అభ్యుదయ పత్రిక ప్రజాశక్తి
44వ వార్షికోత్సవం జరుపుకుంటున్న
సందర్భంగా ఇవియే శుభాకాంక్షలు
అల్లు కూర్మారావు
NRGS టెక్నికల్ అసిస్టెంట్
మరియు సిబ్బంది, టెక్కలి

ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
శ్రీ వెంకట దుర్గ మల్లేశ్వరి ఎంటర్‌ప్రైజెస్
గవర్నమెంట్ హాస్పిటల్ జం॥, బలగ, శ్రీకాకుళం. సెల్: 9908102443
మా వద్ద : ఎలక్ట్రికల్, ప్లంబింగ్,
పెయింట్స్ లభించును.
Proprietor
టి. మోహన్‌రావు
సెల్: 8978253869

ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
ప్రజా సమస్యలపై నిరంతరం అక్షర సమరం సాగిస్తూ..
ప్రతి అక్షరం - ప్రజల పక్షంగా
దినదినాభివృద్ధి చెందుతున్న
ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
మీ
శ్రేయోభిలాషి
నరసన్నపేట

అక్షర సత్యాలతో.. అభ్యుదయ భావాలతో
సామాజిక చైతన్యాన్ని రగిలిస్తూ..
ప్రతి అక్షరం - ప్రజల పక్షం నినాదంతో
ముందుకు వెళ్తున్న
ప్రజాశక్తి కి 44వ వార్షికోత్సవ
శుభాకాంక్షలు
శ్రేయోభిలాషి
RWS

శిథిలావస్థకు చేరుకున్న పశువైద్య భవనం

నిర్మించారు... వదిలేశారు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలో పలు గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సేవలు, సదుపాయాలు అందించాలనే లక్ష్యంతో ప్రజాధనంతో నిర్మించిన ప్రభుత్వ భవనాలు ప్రారంభం కాకుండానే శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో రాజుల సొమ్ము రాళ్ల పాలు అనే సామెతకు అతికినట్లుగా అధికారుల వ్యవహార శైలి ఉంది. కోట్ల రూపాయలు ప్రజాధనంతో నిర్మించిన ప్రభుత్వ భవనాలు ఏళ్ల తరబడి ప్రారంభానికి నోచుకోలేదు. అధికారుల నిర్లక్ష్యంతోనే పలు భవనాలు ప్రారంభోత్సవానికి నోచుకోకుండా శిథిలావస్థకు చేరాయని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.

దిష్టిబొమ్మలుగా హుదూద్ ఇళ్లు

మండలంలో సంతబొమ్మాళి పంచాయతీ లక్ష్మీపురంలో 192 మంది లబ్ధిదారులకు అందించేందుకు రూ.746.15 లక్షల వ్యయం ప్రజాధనంతో నిర్మించిన హుదూద్ ఇళ్లు ఇప్పటికీ పంపిణీ జరగక శిథిలావస్థకు చేరుకున్నాయి. రూ.కోట్లు ప్రజాధనంతో నిర్మించి పట్టించుకోకుండా వదిలేశారు.

ప్రారంభం కాక ముందే శిథిలం

మండలంలో బోరుభద్ర పశు వైద్యశాలకే అనారోగ్యం వస్తే పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఏళ్ల తరబడి శిథిలావస్థలో ఉన్న పశు వైద్యశాలలోనే విధులు నిర్వహిస్తున్నారు అక్కడి పశు వైద్యులు. ఇదంతా ఒక ఎత్తు అయితే రూ.ఆరు లక్షలు ప్రజాధనంతో కొన్నేళ్ల క్రితం నూతన పశువైద్యశాల ప్రారంభించినప్పటికీ... నేటికీ పశువైద్య శాఖకు అప్పగించక, ప్రారంభానికి నోచుకోక శిథిలావస్థకు చేరుకుంది. ఇది కూడా అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రారంభం కాక శిథిలావస్థకు చేరుకుందని పరిసర ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. పూర్తిగా శిథిలమైన భవనంలో వైద్య సేవలు అందిస్తున్నారు. ఇక్కడ వృథా.. అక్కడ వ్యథ అన్న సందంగా ఉంది.

ప్రజాశక్తి
44వ వార్షికోత్సవ
శుభాకాంక్షలు
ప్రజా సమస్యలపై
నిరంతరం అక్షర
సమరం సాగిస్తూ..
ప్రతి అక్షరం
ప్రజల పక్షంగా
దినదినాభివృద్ధి
చెందుతున్న
ప్రజాశక్తి 44వ
వార్షికోత్సవ
శుభాకాంక్షలు
మీ
శ్రేయోభిలాషి
టెక్కలి.

ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
కార్మికులు, కర్షకులు,
శ్రామిక వర్గాల
అభ్యున్నతి కోసం నిరంతరం
అక్షర సమరం చేస్తున్న
ప్రజా అభ్యుదయ పత్రిక ప్రజాశక్తి
44వ వార్షికోత్సవం
సందర్భంగా ఇవియే
శుభాకాంక్షలు
వి.జయరాజ్
ఇంచార్జ్ JD
DDAH., వెటర్నరీ, టెక్కలి
మరియు సిబ్బంది

ప్రజాశక్తికి 44వ వార్షికోత్సవ
శుభాకాంక్షలు
నిత్య నూతనం - సత్యకేతనం
ప్రతి అక్షరం ప్రజల పక్షాన నిలుస్తూ...
దినదినాభివృద్ధి చెందుతున్న
ప్రజాశక్తి దినపత్రికకు
44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
జి. నర్సింహులు
ఎం.ఇ.ఒ -1
నందిగాం మండలం,
ఎ. చిన్నరావు
ఎం.ఇ.ఒ-2
నందిగాం మండలం.

ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
ప్రతి అక్షరం - ప్రజల పక్షం...
ప్రతి పదం - ప్రజా హితం...
ప్రతి నిత్యం - ప్రజా సంక్షేమం కోసం...
అక్షర సమరం సాగిస్తున్న
"ప్రజాశక్తి"కి 44వ వార్షికోత్సవ
శుభాకాంక్షలు
కె. రాము
డిప్యూటీ తహశీల్దార్ (సివిల్ సప్లై),
కోటబొమ్మాళి మండలం.

'ప్రజాశక్తి' కు
44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
అత్యున్నత లక్ష్యాలు... ఉన్నత విలువలు - అంకితభావంతో...
విపత్కర పరిస్థితులను అధిగమించి...
ప్రజాశక్తి అభివృద్ధికి కృషి చేస్తున్న పాత్రికేయులకు, సిబ్బందికి
44వ వార్షికోత్సవ
శుభాకాంక్షలు
బుడ్డా మోహన్‌రెడ్డి
బావనపాడు సర్పంచ్,
వైకాపా నాయకులు,
శ్రీమతి బుడ్డా రాజ్యలక్ష్మి
ఎంపిటిసి, బావనపాడు,
సంతబొమ్మాళి మండలం

ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
కార్మిక, కర్షక, బడుగు,
బలహీన వర్గాల ప్రజలకు
సమున్నత న్యాయం
కల్పించాలనే మీ ఆశయం.
ప్రతి అక్షరం - ప్రజల పక్షంగా భావించి
సమాజోద్ధరణకు కలం పట్టిన
కర్షక 'ప్రజాశక్తి'
సోదరులకు శుభాకాంక్షలు
శేఖర్‌రావు
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, టెక్కలి

నౌపడ రైలు ఉద్యమం

ప్రజా పోరాటాలకు దిక్సూచి

సిక్కోలు గడ్డపై జరిగిన అనేక పోరాటాలు ప్రజా పోరాటాలకు దిశానిర్దేశం చేశాయి. పలు పోరాటాలు శ్రీకాకుళం చరిత్ర పుటల్ని పోరు కథలతో ఎరుపెక్కించాయి. ప్రస్తుతం విప్లవ పార్టీల నాయకత్వంలో, వామపక్షాల నాయకత్వంలో జరుగుతున్న ప్రజాతంత్ర విప్లవాలు ప్రజాభాగస్వామ్యాన్ని ఎక్కువగా పొందుతున్నాయి. వామపక్షాలు, విప్లవ పార్టీలు కలిపి ఇతర అన్ని రాజకీయపక్షాల్ని, ప్రజాసంఘాల్ని కలుపుకొని విజయపథంలో నిలిచిన ఉద్యమం నౌపడా రైలు ఉద్యమం. నౌపడా-గుణుపూర్ బ్రాడ్‌గేజ్ మార్గం నిర్మాణంతోపాటు నౌపడ రైల్వేస్టేషన్‌లో అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లూ నిలుపుదల చేయాలని కొనసాగిన మహా ఉద్యమం ఐదు సంవత్సరాల కాలంలో మహోద్యమంగా మారింది.

ప్రజాశక్తి - టెక్కలి

నౌపడ రైలు ఉద్యమం ఆంధ్రా-ఒడిశా రాష్ట్రాల ఐక్యతను చాటి చెప్పింది. నౌపడ - గుణుపూర్ మార్గంలో ఎత్తివేసిన నేరోగేజ్ రైలు మార్గాన్ని 'బ్రాడ్‌గేజ్'గా మార్చింది. నౌపడాలో మెయిల్, ఈస్ట్‌కోస్ట్, హీరాఖండ్ రైళ్ల హాల్ట్‌ల్ని తీసుకొచ్చింది. శ్రీకాకుళంలో ఆగిపోయే విశాఖ ఎక్స్‌ప్రెస్‌ను పలాస వరకూ పరుగెత్తించింది. (ఆ తరువాత విశాఖ ఎక్స్‌ప్రెస్‌ను భువనేశ్వర్ వరకు పొడిగించారు). అన్నింటి కంటే ముఖ్యంగా పాలక రాజకీయ పక్షాల స్వార్థం కోసం ప్రజాఉద్యమాలను ఫణంగా పెట్టకుండా, ప్రజాతంత్ర ఉద్యమాల్ని నడపగలిగే నాయకత్వముంటే ఆ ఉద్యమాలు విజయం సాధించి తీరుతాయని రుజువు చేసింది. పోలీసుల క్రూర విధానాలు, లాఠీల ఖర్కశత్వం ప్రజల్ని అణచలేవని భవిష్యత్తు తరానికి చాటి చెప్పింది. ఇన్ని ఘనమైన పాఠాల్ని ప్రజలకందించిన చారిత్రక రైలు ఉద్యమాన్ని 1989-1994 మధ్య ఆంధ్రా-ఒడిశా ఐక్య కార్యాచరణ సమితి అడుగడుగునా అణచివేతను ఎదుర్కొంటూ ముందుకు తీసుకువెళ్లింది.

కనీస సౌకర్యాలు నిల్

ప్రస్తుతం నౌపడ - గుణుపూర్ మార్గంలో నడుస్తున్న రైళ్లను ఒకవైపు పూరీ, మరోవైపు విశాఖ వరకూ పొడిగించారు. నష్టాలొస్తాయనే సాకుతో ఎత్తివేసిన ఈ మార్గం ప్రస్తుతం నెలకు రూ.26 లక్షలు ఆదాయం తెస్తూ ప్రధాన ఆదాయ ఉపమార్గంగా నిలిచింది. నౌపడా జంక్షన్ ప్రస్తుతం జిల్లాలో అతి రద్దీ అయిన ఏకైక కూడలి స్టేషన్‌గా మారిపోయింది. నౌపడా-గుణుపూర్ మార్గం స్టేషన్లలో కనీస సౌకర్యాలు కొరవడ్డాయని, అనేక స్టేషన్లకు ప్లాట్‌ఫారాలు నిర్మించలేదని ఆంధ్రా-ఒడిశా ఐక్యకార్యాచరణ సమితి కన్వీనర్ పేడాడ పరమేశ్వరరావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గుణుపూర్-రాయఘడ మార్గంలో సర్వే చేసినప్పటికీ పనులు ప్రారంభించలేదని, తక్షణమే గుణుపూర్ మార్గాన్ని రాయిఘడకు పొడిగించాలని ఎఒజెఎసి డిమాండ్ చేస్తోంది. పాలకపక్షం తమ గోడు వినకపోతే మరోసారి రైలు ఉద్యమానికి సిద్ధమవుతామని ఎఒజెఎసి కన్వీనర్ పేడాడ పరమేశ్వరరావు హెచ్చరించారు. ప్రయాణికుల సౌకర్యాల దృష్ట్యా రైల్వే శాఖ నిర్ణయం తీసుకోవాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. సమస్యను పరిష్కరించకపోతే ఉద్యమం తీవ్రతరం అవుతుందని వారు హెచ్చరిస్తున్నారు.

మలుపులు

1952లో నౌపడా-గుణుపూర్ మార్గాన్ని తాము స్వాధీనం చేసుకుంటామని భారత ప్రభుత్వం అప్పటి సంస్థానం వారసుడైన గోపీనాథ్ గజపతికి నోటీసు జారీ చేసింది. అప్పట్లో గోపీనాథ్ గజపతి పాలక కాంగ్రెస్ పక్షానికి అనుకూలంగా ఉన్నందున రైలు మార్గాన్ని, అప్పటివరకు ఉన్న రైలు ఇంజన్లు, బోగీలను భారత ప్రభుత్వానికి అప్పగిస్తూ లేఖ ఇచ్చారు. నౌపడా, గుణుపూర్, పర్లాఖిమిడి, కాశీనగర్‌లో తనకున్న విశ్రాంతి అతిథిగృహాలు మినహా మిగిలిన రైల్వే ఆస్తులన్నీ రైల్వేకి అప్పగిస్తూ అఫిడవిట్ దాఖలు చేశారు. ఈ ప్రాంతం ప్రజలు చిన్నబండిగా పిలుచుకునే నౌపడా-గుణుపూర్ మార్గం అనంతరకాలంలో భారత ప్రభుత్వం చిన్నచూపుకు బలైంది. ఇంజన్లు, రైలు పెట్టెలు కనీసం మరమ్మతులకు నోచుకోలేదు. ఈ మార్గంలో నష్టాలొస్తున్నాయనే సాకుతో 1989లో భారత రైల్వే ఈ మార్గాన్ని ఎత్తివేస్తున్నట్లు పార్లమెంట్‌లో ప్రకటన చేసింది. దక్షిణ ఒడిశాలో పర్లాఖిమిడి, కాశీనగర్, గుణుపూర్ ప్రాంత ప్రజలు, శ్రీకాకుళం జిల్లాలో టెక్కలి, తెంబూరు, పాతపట్నం వాసులు ఈ చర్యపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అప్పటికి ఈ ప్రాంతాల్లో పార్లమెంట్ స్థానాల్లో ఉన్న నేతలందరికీ వినతులిచ్చినా ఫలితం దక్కలేదు. పుండు మీద కారం చల్లిన చందంగా నౌపడా రైల్వేస్టేషన్‌లో మెయిల్, హీరాఖండ్, ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌ల నిలుపుదలను ఎత్తివేస్తూ 1990 ఫిబ్రవరి 18న రైల్వే అధికారులు నిర్ణయం తీసుకున్నారు. రైల్వే తీసుకున్న ఈ అనాలోచిత, ఆకస్మిక నిర్ణయం నౌపడా రైల్వేస్టేషన్ ప్రాంతంలో అలజడికి శ్రీకారం చుట్టింది.

మహోద్యమం

నౌపడా రైలు ఉద్యమాన్ని కాకాలు తీరిన పోరాట యోధులు మహోద్యమంగా పేర్కొన్నారు. 1991 జనవరి నెలలో ఆంధ్రా-ఒడిశా ప్రముఖులు, ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు ప్రాతినిధ్యంతో ఆంధ్రా-ఒడిశా ఐక్య కార్యాచరణ సమితి ఏర్పడింది. కార్యాచరణ సమితికి అప్పటికే ఎపిసిఎల్‌సి జిల్లా అధ్యక్షునిగా ఉన్న పేడాడ పరమేశ్వరరావు కన్వీనర్‌గా ఎన్నికయ్యారు. కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, బిజెపి, సిపిఐ, సిపిఎం (ఎంఎల్), తెలుగుదేశం పార్టీ, ప్రజామిత్ర, ఎపిసిఎల్‌సి, ఒపిడిఆర్‌లతోపాటు అనేక రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు పోరాట పంథాను ఎంచుకున్నాయి. వేలాదిమంది ప్రజలు ముఖ్యంగా మహిళలు, విద్యార్థులు రైలు పట్టాలెక్కారు. ఊహించని ఈ పరిణామానికి ప్రభుత్వం ఉక్కిరి బిక్కిరి అయింది. మీడియా ఫొటోల కోసం కాకుండా రోజులు తరబడి రైలు ఉద్యమం కొనసాగించారు. 1992 ఏప్రిల్ 14న నౌపడా స్టేషన్‌కు మూకుమ్మడిగా సుమారు 20వేల మంది ఆంధ్రా-ఒడిశా ఉద్యమకారులు చేరుకున్నారు. రైలు పట్టాలపై 'టెంట్లు' వేసి వంటలు చేసుకుంటూ ఉద్యమాన్ని సాగించారు. అప్పటికే ఉద్యమ నాయకులపై పదుల సంఖ్యలో కేసులు నమోదు చేసి జైల్లోకి నెట్టిన పాలకపక్షం ఆ రోజు మరోసారి కన్నెర్ర చేసింది. హౌరా-చెన్నై మార్గంలో 24గంటలపాటు రైళ్లు రద్దయ్యాయి. నౌపడాలో ఏమి జరుగుతోంది, ఆందోళనకారులు రైలు సమస్యల పరిష్కారానికి 24 గంటలూ పట్టాలపై కూర్చొని, వంటలు చేస్తూ నిరవధిక రోకో సిద్ధం కావడం వెనుక మీ వైఫల్యం ఏమిటని ప్రతిపక్షాలు పార్లమెంట్‌లో అప్పటి అధికార కాంగ్రెస్ పార్టీని ఉతికి ఆరేశాయి. దీంతో రెచ్చిపోయిన కేంద్రం నౌపడా స్టేషన్‌లో కర్ఫ్యూ ప్రకటించింది. కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులు జారీ చేసింది.

జనం మరింత ఎక్కువయ్యారు. నాయకులు ముందు వరుసలో నిల్చొన్నారు. స్థానిక రైల్వే ఆర్‌పిఎఫ్, రిజర్వ్ సిఆర్‌పిఎఫ్ క్యాంపులు ఆందోళనకారులపై విరుచుకుపడి లాఠీఛార్జీ జరిపాయి. ఈ ఘటనలో వందలాది మంది గాయపడగా, సమితి కన్వీనర్ పేడాడ పరమేశ్వరరావు, కార్యదర్శి వర్గం సభ్యుడు ఉప్పాడ రామారావులకు బలమైన గాయాలయ్యాయి. వీరితోపాటు ఒడిశాకు చెందిన రాంగోపాల్, జొన్నసుభాష్, చంద్రబోస్, గోపీనాథ్ పండా తదితర 18 మంది ప్రముఖులపై 307 (ఐపిసి) వంటి బలమైన సెక్షన్లతో కేసులు నమోదు చేశారు.

ఉద్యమకాలంలో సమితి కన్వీనర్ పరమేశ్వరరావుతోసహా 36 మందిపై నాలుగు బలమైన కేసుల్ని పోలీసులు నమోదు చేశారు. పరమేశ్వరరావు నాలుగు సార్లు అరెస్టయి 148 రోజులు జైలులో గడిపారు. 1993 జనవరి 25న రాత్రి అతన్ని పోలీసులు అనధికారికంగా అదుపులోకి తీసుకున్న వెంటనే రాత్రి 2 గంటలకు ప్రజానీకం రైలు పట్టాలెక్కి ఉద్యమ శంఖం పూరించారు. చేసేదిలేక జనవరి 26న సాయంత్రం పోలీసులు పరమేశ్వరరావును విడుదల చేశారు. 1993 ఏప్రిల్‌లో రైల్వే అధికారులు నౌపడా రైల్వేస్టేషన్‌లో ఎత్తివేసిన ట్రైన్లకు హాల్ట్‌లు పునరుద్ధరించారు. ఆ తరువాత ఉద్యమసెగలు తగ్గినందున 1994 అక్టోబర్‌లో నౌపడా-గుణుపూర్ మార్గాన్ని బ్రాడ్‌గేజ్‌గా మార్పు చేస్తామని కేంద్రం పార్లమెంట్‌లో స్పష్టమైన ప్రకటన చేసింది.

నౌపడ - గుణుపూర్ మార్గం చరిత్ర

1898లో తన సొంత వినియోగం కోసం అప్పటి పర్లాఖిమిడి రాజు కృష్ణచంద్ర గజపతి నౌపడా- గుణుపూర్ రైలు మార్గాన్ని నిర్మించారు. మైసూరు రాజులకు సామంత రాజ్యంగా కొనసాగే పర్లాఖిమిడి సంస్థానం నుంచి ఆయన నౌపడా వచ్చి, అక్కడ తన అతిథిగృహంలో విశ్రాంతి తీసుకొని హౌరా-చెన్నై రైలు మార్గంలో మైసూరు వెళ్లేవారు. ఆవిరి యంత్రాన్ని పోలిన నౌపడా-పర్లాఖిమిడి రైలు ఇంజన్‌లో ముందుగా సకల సౌకర్యాలతో రాజు కుటుంబీకు లు ప్రయాణించేందుకు ఒక సెలూన్ (కంపార్ట్‌మెంట్), తన పరివారం, వంట సిబ్బంది ప్రయాణించేందుకు రెండు సెలూన్లు ఉండేవి. రైలు ఇంజనుతోపాటు సెలూన్లు నౌపడాలో ఆయన అతిథిగృహానికి వెళ్లిపోయే విధంగా రైలు పట్టాలుండేవి. ఈ ఇంజను నడిచేందుకు పర్లాఖిమిడి- నౌపడా మధ్య 225 మంది కూలీలు తమ శ్రమని ధారపోసేవారు. వారు రైల్లు బయల్దేరే వర్తమానం వచ్చేసరికి మార్గమధ్యలో తమకు కేటాయించిన ప్రాంతంలో అడవి కలప, నీరుతో సిద్ధంగా ఉండేవారు.

కలపతో మంటను మండించి మరిగించిన నీరు ఆవిరయితే నేరోగేజ్ రైలు కొండల నడుమ నుంచి పరుగులు తీసేది. మరో విషయమేమిటంటే 1898 నుంచి 1903 వరకూ ఈ రైలు ఇంజన్ డ్రైవర్లగా ఇంగ్లండ్ వారే కొనసాగేవారు. సెలూన్ నిర్మాణం, రైలు పట్టాలు వేయడం, వాటి పర్యవేక్షణ బాధ్యతల్ని కూడా బ్రిటీష్ ఇంజినీర్లు చూసుకున్నారు. ప్రజా రవాణాకు, అటవీ ఉత్పత్తులకు అందుబాటుగా రైలు మార్గాన్ని వినియోగిస్తే జనరంజకంగా ఉంటుందని కృష్ణచంద్ర గజపతి భావించి 1905లో పర్లాఖిమిడి నుంచి గుణుపూర్ వరకూ ఈ మార్గాన్ని పొడిగించారు.

1906లో గుణుపూర్-నౌపడా మధ్య నేరోగేజ్ మార్గంలో ప్రజా రవాణా ప్రారంభమైంది. కృష్ణచంద్ర గజపతి చేసిన ఈ మహాత్కార్యంతో ఆయన ఈ ప్రాంత ప్రజలకు దేవుడయ్యారు.

గుణుపూర్-నౌపడా మధ్య విరివిగా లభించే అటవీ ఉత్పత్తులను ప్రజలు రవాణా చేస్తూ రైళ్లపై ఆధారపడి బతికే పరిస్థితి బలపడింది. 1911 నుంచి ఈ మార్గంలో అప్పటి రాజ సంస్థానం సరుకులు రవాణా కోసం పార్సిల్ సర్వీసును అదనంగా ప్రారంభించి ప్రజలకు మరింత చేరువైంది. స్వాతంత్ర్యం అనంతరం పరిస్థితులు మారిపోయాయి.

ఫెలికాన్ పక్షులు

గగనాన తేలి.. నీలాపురంలో వాలి..

- విదేశీ పక్షులకు విడిది సమస్యలు
- అభివృద్ధికి నోచుకోని పక్షుల విడిది కేంద్రం
- పర్యాటకులు ఉన్నా అభివృద్ధి సున్నా..

వినీలాకాశంలో విహంగాల రెక్కల చప్పళ్లతో వాలి, ఈ ప్రాంత ప్రజానీకానికి తమ సోయగాలతో కనువిందు చేస్తూ విహంగాల విన్యాసాలతో పర్యాటకుల మదిని దోచే విదేశీ పక్షుల విడిది కేంద్రం తేలినీలాపురం. సైబీరియా దేశం నుంచి వచ్చి సంతానోత్పత్తి చేసుకుని సుమారు ఆర్నెల్లపాటు ఈ ప్రాంత ప్రజానీకానికి కనువిందు చేస్తాయి.



ప్రజాశక్తి - నౌపడ

ప్రతి సంవత్సరమూ 3000 వరకు ఫెలికాన్, స్టార్క్స్ జాతికి చెందిన పక్షులు సైబీరియా, రష్యా, మలేషియా, హంగేరి, సింగపూర్, జర్మనీ దేశాల నుండి ఇక్కడికి వస్తుంటాయి. సుమారు 113 రకాల విదేశీపక్షులు వస్తాయని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. గత రెండు దశాబ్దాలుగా ఇవి వాటి సంతానోత్పత్తి కోసం ఒక వైపు సుమారు 7000 కిలోమీటర్లు ప్రయాణించి తేలినీలాపురం గ్రామానికి వస్తాయి. సెప్టెంబరులో వచ్చి గుడ్లు పెట్టి పొదిగి మార్చి నెల వరకు ఇక్కడే నివసిస్తాయి. తర్వాత వాటి పిల్లలతో కలిసి మేలో వాటి మాతృ దేశానికి వెళ్లిపోతాయి. ఈ పక్షులు గత కొన్ని సంవత్సరాలుగా ఒకే గగన మార్గంలో వస్తున్నాయని ఆంధ్ర విశ్వవిద్యాలయ పరిశోధకులు చెబుతున్నారు. టెక్కలి పరిసర ప్రాంతాలైన తేలినీలాపురం, ఇజ్జువరం, అలాగే నౌపడ ప్రాంతాల్లోని కొలనులు, చెరువులు, గెడ్డలో వేట సాగిస్తుంటాయి. చుట్టుపక్కల గ్రామాలు వీటికి స్థావరాలుగా ఉంటూ.. పర్యాటకులతో పాటు స్థానికులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

ప్రకటనలకే పరిమితం

తేలినీలాపురం కేంద్రాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దాలన్న, ప్రభుత్వ నిర్ణయం ప్రకటనలకే పరిమితమైంది. పర్యాటక రంగానికి పెద్దపీట వేస్తున్నామని పాలకులు ఇచ్చిన హామీలు నీటి మీద రాతలుగా మిగిలిపోయాయి. బోర్డులు ఏర్పాటుకే పరిమితమైందే తప్ప మరెటువంటి అభివద్ధి జరగలేదు. పక్షుల చరిత్రలను వివరించే ప్రక్రియ చేపట్టలేదు. జీవన విధానం మీద పరిశోధనలు జరగలేదు. సైబీరియా దేశం నుంచి వచ్చే ఈ పక్షులు సంతానోత్పత్తి అనంతరం మరలా ఆ దేశానికి వెళ్లి తిరిగి వచ్చినంత వరకూ జీవిస్తుంటాయి. స్వదేశానికి వెళ్లే క్రమంలో మార్గంమధ్యలో మరణిస్తాయని పరిశోధనలో తేలింది. నెల్లూరు జిల్లాకూ ఈ పక్షులు రావడంతో అక్కడి నిపుణులు చేసిన పరిశోధనలే ప్రామాణికాలు రాకపోకలు సాగించే పక్షుల కాళ్లకు ట్యాగ్‌లు కట్టి పరిశోధనలు జరిపారు. వీటి సమాచారాన్ని పొందుపరిచేవారు కూడా లేకపోవడం దురదష్టకరం.

అభివద్ధి చేయాలి

ప్రధానంగా విడిది కేంద్రం వద్ద తాగునీటి సౌకర్యం లేదు. పర్యాటక రంగంగా అభివద్ధి చేస్తామని చెప్పినప్పటికీ ఆచరణలో చూపకపోవడం విచారకరం. ఇప్పటికైనా పాలకులు స్పందించి పక్షులు విడిది కేంద్రాన్ని అభివృద్ధి చేయాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.

పక్షుల మృత్యువాతపై ఆందోళన

తేలినీలాపురం విడిది కేంద్రానికి గత ఏడాది అధికారుల లెక్కల ప్రకారం 346 పక్షులు వచ్చాయి. అంతు పట్టని కారణాలతో అందులో 76 పక్షులు మృత్యువాత పడ్డాయి. దీనిపై నాడు అటవీశాఖ అధికారులు స్పందించారు. "తేలినీలాపురం చుట్టుపక్కల సుమారు 9 చెరువులు (1500 నుంచి 2 వేల ఎకరాల విస్తీర్ణంలో) ఉన్నాయి. గత కొన్ని దశాబ్దాలుగా ఇక్కడే పక్షులు ఆహారాన్ని వేటాడుతున్నాయి. అయితే ఈ మధ్య కాలంలో గ్రామస్తులు ఈ చెరువులో కంపెనీ చేపలు పెంచుతున్నారు. ఆ చేపల్లో నులిపురుగులు ఎక్కువగా ఉంటాయి. వాటిని తిన్న పక్షుల్లో ఆ నులిపురుగులు వ్యాపించి జీర్ణ వ్యవస్థ దెబ్బతిని చనిపోతున్నాయి' అని ప్రాథమికంగా గుర్తించారు.

ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాల్సిన తేలినీలాపురం గ్రామాన్ని మరింతగా అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.

శిథిలావస్థలో భవనాలు

పర్యాటకులను ఆకర్షించడానికి, అతిథులు విశ్రాంతి తీసుకోవడానికి వీలుగా నిర్మించిన అతిథి గృహం శిథిలావస్థకు చేరుకుంది. విలువైన సామగ్రి అధికారుల ఇళ్లకు తరలిపోయాయనే ఫిర్యాదులున్నాయి. దశాబ్దాల క్రితం నిర్మాణం జరిగిన ఈ భవనాలకు మరమ్మతులకు చేపట్టకపోవడంతో పూర్తిగా శిథిలం చెందాయి. మరోవైపు తాగునీటి సౌకర్యం లేకపోవడంతో ప్రధాన సమస్యగా మారింది. నిర్మాణం జరిగినా వాచ్ టవర్‌కు మరమ్మతులు లేకపోవడంతో ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. వాచ్ టవర్ మీద నుంచి పక్షుల విన్యాసాలను తిలకించేందుకు వీలుగా అటవీశాఖ ఏర్పాటు చేసే బైనాక్యులర్స్ మరమ్మతులకు గురయ్యాయి. అధికారుల ఆలనాపాలనా లేకపోవడంతో పరికరాలు కనుమరుగవుతున్నాయి.

మృత్యువాత పడిన పక్షులు (ఫైల్)

వాచ్ టవరే.. వ్యూ పాయింట్

సుమారు రెండు దశాబ్దాల కాలం నుంచి ఈ ప్రాంతానికి పక్షులు వస్తున్నాయి. మొదట్లో ఈ పక్షులు రాక వింతగా అనిపించినప్పటికీ క్రమేపీ ఈ ప్రాంతీయులు వాటి రాకకు ముగ్ధులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపి పక్షుల నివాసానికి కావాల్సిన ఏర్పాట్లు చేసింది. పక్షులు ఆహారానికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో అడ్డంగా ఉన్న హెచ్‌టి విద్యుత్ లైన్లు తగిలి మరణిస్తూ ఉండేవి. వీటిని గమనించిన ప్రభుత్వం విద్యుత్ లైన్లను మార్చింది. మొదట్లో విదేశీ పక్షులు విహంగాల కేంద్రానికి ప్రజల తాకిడి ఎక్కువ కావడంతో ప్రభుత్వం పర్యాటక కేంద్రంగా మార్చింది. అటవీశాఖ ఆధ్వర్యాన అతిథిగృహం నిర్మాణం జరిపించడమే కాకుండా సుమారు రూ.10 లక్షల వ్యయంతో వాచ్ టవర్‌ను నిర్మించింది. పర్యాటకులు వాచ్ టవర్ మీద నుంచి పక్షుల విన్యాసాలను తిలకిస్తుంటారు.

సైబీరియా దేశం నుంచి ప్రధానంగా రెండు జాతుల పక్షులు మండలంలోని తేలినీలాపురం గ్రామానికి వస్తాయి. ఫెలికాన్, పెంటైడ్ స్టార్క్ అనే జాతి పక్షులు వస్తాయి. ప్రస్తుతం ఆ ప్రాంతం ఉష్ణ ప్రాంతం కావడంతో

విచిత్ర జీవనశైలి

కేవలం సంతానోత్పత్తికి మాత్రమే ఇక్కడకు వస్తాయి. ఏటా అక్టోబరులో ఈ పక్షులు వేలాదిగా తరలివస్తాయి. తేలినీలాపురంలోని చింత చెట్ల మీద మాత్రమే నివాసం ఏర్పాటు చేసుకొనే ఈ పక్షులు గుడ్లు పెడతాయి. అవి పొదిగి పిల్లలైనంత వరకూ ఇక్కడే ఉంటాయి. చెట్ల చివరన గూడు నిర్మించుకునే ఈ పక్షులు జీవనం ఆద్యంతం కనువిందు చేస్తాయి. ఫెలికాన్(గూడ కొంగలు), పెంటైడ్ స్ప్రా స్టార్క్ (కనుమ కొంగలు)గా పిలవబడే వీటి జీవనం విచిత్రంగా ఉంటుంది. పక్షి తన పిల్లకు ఆహారమందించే ప్రక్రియ వినూత్నంగా ఉంటుంది. గూడ కొంగలు సముద్రం మీదకు వేటకు వెళ్తాయి. కెరటాల అలల ఉధృతి మధ్య ఉన్న చేపల్ని పసిగట్టి, తన ముక్కును కరుచుకుని కింద ఉన్న సంచిలో వేసుకుంటుంది. ఒక్కొక్క పక్షి సుమారు రెండు కిలోల చేపలను వేటాడి తిరిగి తన గూటికి వస్తాయి. తమ ముక్కు ద్వారా పిల్ల పక్షి నోటికి చేపను అందిస్తాయి. ఈ క్రమంలో చేపలు కింద పడితే మరలా వాటిని ముట్టుకోదు. గ్రామ ప్రజలు ఆ చేపను మరలా గూటికి చేర్చినా తిరస్కరిస్తాయి. మరో విచిత్రమైన జీవనశైలి ఏమిటంటే గూటి నుంచి పక్షి పిల్లలు కింద పడినా మరలా వాటిని ముట్టుకోవు. ఇటువంటి విచిత్రమైన జీవనశైలిని తెలుసుకొన్న అటవీ శాఖాధికారులు వలలు కట్టుకొని వాటిని సంరక్షిస్తుంటారు. పక్షి పిల్లలకు రెక్కలొచ్చి మరలా ఎగిరేంత వరకు అవి ఇక్కడే నివసిస్తాయి. పొడవైన ముక్కుతో, వెడల్పు అయిన రెక్కలతో, పొడవైన కాళ్లతో సుమారు రెండున్నర అడుగులుండే ఈ పక్షులు ఒక్కొక్కటి సుమారు 10 నుంచి 12 కిలోల వరకూ ఉంటుంది. వీటిని తిలకించేందుకు పర్యాటకులు వస్తుంటారు. ఇవి వేసే రెట్టలతో ఉదరకోశ వ్యాధులుండవని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.

స్థానికుల సంరక్షణలో విహంగాలు

ఈ ప్రాంతానికి వచ్చే విదేశీ పక్షుల్ని ఈ ప్రాంతీయులు దేవతా పక్షులుగా భావిస్తారు. ఏటా అక్టోబరులో వచ్చే ఈ పక్షుల రాకతో పంటలు సమృద్ధిగా పండుతాయనేది వీరి నమ్మకం. దీంతో ఈ పక్షుల్ని వీరు ఆరాధించి కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. ఎవరూ వీటికి హాని తలపెట్టరు. జీవన క్రమంలో ఒక్కొక్కసారి పక్షి పిల్లలు కిందకు పడిపోయినప్పుడు పక్షులు వాటిని తీసుకోకపోవడంతో గ్రామస్తులే వాటిని పెంచి చేరదీస్తారు. అటవీశాఖాధికారులకు అప్పగించిన తరువాత వారు వాటిని 'జూకు తరలిస్తారు.

పార్కులో ఆహ్లాదం కరువు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ప్రాంత ప్రజానీకానికి ఆహ్లాదకరం కల్పించడంలో భాగంగా 2018లో ఎర్రన్నాయుడు సమగ్ర రక్షిత తాగునీటి పథకం సమపంలో రూ.90 లక్షలతో కింజరాపు అచ్చెన్నాయుడు పార్కును జాతీయ రహదారి పక్కనే ఏర్పాటు చేశారు. పార్కు ప్రారంభించినా వినియోగంలోకి రాక రూ.90 లక్షలు వలువైన నిధులు వృథా అయ్యాయి. పార్కులో ముళ్లచెట్లు పెరిగాయి. అపరిశుభ్ర వాతావరణానికి తోడు అసాంఘిక కార్యక్రమాలకు నెలవుగా మారింది. పిల్లల ఆటల కోసం ఏర్పాటు చేసిన పలు పరికరాలు ఏడాదికే శిథిలమయ్యాయి. పార్కులో ఏర్పాటు చేసిన ఫౌంటేను పనిచేయడం మానేశాయి. లైటింగ్ సౌకర్యానికి దూరంగా వాకింగ్ ట్రాక్ వినియోగంలో లేదు. పార్కులోని తెలుగుతల్లి, ఎన్‌టిఆర్, ఎర్రన్నాయుడు వంటి విగ్రహాలు సైతం రంగులు వెలిసి దయనీయమైన పరిస్థితిలో కనిపిస్తున్నాయి. రూ.90 లక్షలు వెచ్చించి నిర్మించిన పార్కు ఎందుకూ పనికిరాకుండా పోయింది. ప్రభుత్వం మారడంతో పార్కుపై ఆశక్తి చూపకపోవడంతో ప్రజలు విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నారు. మరలా టిడిపి ప్రజాప్రతినిధులు స్పందించి వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు.